# మూడేళ్ళ మోదీ పాలన

# మూడేళ్ళ మోదీ పాలన

*తెలుగు అనువాదం*

**కె. ఉషారాణి**

PSBH

ప్రజాశక్తి బుక్‌హౌస్

*27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, రాఘవయ్యపార్కు వద్ద*

*విజయవాడ - 520 002. ఫోన్ : 9490099202*

PSBH

టైటిల్ డిజైన్ : *ఎ. గిరిధర్*

**ప్రచురణ సంఖ్య** : 1467

**ప్రజాశక్తి ప్రథమ ముద్రణ** : జులై, 2017

వెల : ₹ 40/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533.

**బ్రాంచీలు**

విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ,

గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

126331

# విషయసూచిక


❖ ముందుమాట 7

❖ ముసుగులు తొలగిపోయాయి :
మతతత్వ దాడులకు తెరలేచింది 11

❖ రాజ్యాంగ హక్కులపై నిరంతర దాడి 20

❖ అష్టకష్టాలు పడుతున్న దళితులు 24

❖ అస్తవ్యస్థ విదేశాంగ విధానం 29

❖ ఉపాధి లేక అల్లల్లాడుతున్న ప్రజలు 34

❖ కార్పొరేట్ ఎగవేతదారులకు వరాల జల్లు 38

❖ మోదీ రాజ్యంలో మహిళలు 43

❖ అమ్మకానికి దేశం 50

❖ కార్మికులు తమ హక్కులు జీవనోపాధిపై దాడిని తిప్పికొడుతున్నారు 55

❖ రైతులను దోచి కార్పొరేట్ల బొక్కసాలు నింపుతున్న మోదీ 59

❖ ధరలు 64

❖ విద్యపై దౌర్జన్యం నిరాఘాటంగా కొనసాగింపు 68

# ముందుమాట

పరిపాలిస్తున్న ఏ ప్రభుత్వాన్నైనా అది ఓట్లు అడిగినప్పుడు చేసిన వాగ్దానాల ఆధారంగానే అంచనా వేయగలం. ఆ రకంగా అంచనా వేసినట్టయితే ఈ మూడు సంవత్సరాలు మోదీ విఫలమయినట్టే. అంతకంటే దురదృష్టకరమయిన విషయం ఏమిటంటే ముఖ్యమయిన విషయాల పట్ల మోదీ అనుసరిస్తున్న విధానాలు, నిర్ణయాలూ భారతదేశ సమగ్రతకే ముప్పు తెచ్చిపెడుతున్నాయి.

మోదీ కాశ్మీరు సమస్య పట్ల అనుసరిస్తున్న వైఖరినే ఉదాహరణగా తీసుకుందాం. గత మూడేళ్ళగా ఆయన అనుసరిస్తున్న విధానం, ముఖ్యంగా గత ఏడాదిగా ఆయన అనుసరిస్తున్న విధానం అత్యంత వినాశనకరంగా ఉంది. లోయ ఎప్పుడూ అశాంతితో నిండి ఉండాలన్న పాకిస్థాన్ లక్ష్యానికి బలం చేకూర్చేదిగా ఉంది. ఎంతగా గొప్పలు చెప్పుకుంటున్నా టెర్రరిస్టులు లోయలోకి రావడాన్ని ఆపడంలో విఫలమయ్యింది. పూర్తిగా రాజకీయంగా పరిష్కరించాల్సిన సమస్యను అణచివేయడం ద్వారా పరిష్కరించాలనుకుంటున్నది. చొరబాటుదారులు రావడం ఆగకపోగా మనసైన్యం ప్రాణాలను పణంగా పెట్టవలసి వస్తున్నది. రాజకీయంగా జోక్యం చేసుకునేందుకు తిరస్కరించడం వలన కాశ్మీర్‌లోని అధిక సంఖ్యాకులు ప్రభుత్వానికి దూరమయ్యారు. ఇది మరింత విచారకరమయిన విషయం. కేంద్ర అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ రాజకీయ చర్చలకు నాంది పలికే బదులుగా రకరకాల నాయకులు చేసే నిర్హేతుక స్వదేశాధిపత్యాభిమానం, జగడాలమారి ప్రకటనలు జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసాయి. అందువలననే గౌరవనీయులైన ఎంతోమంది విశ్రాంత సైనికోద్యోగులు ప్రభుత్వ కాశ్మీర్ విధానం పట్ల తమ అసంతృప్తిని వ్యక్తపరిచారు.

మోదీ ప్రభుత్వం కుల ఘర్షణలను నివారించడంలో, ముఖ్యంగా ఆవుని రక్షిస్తున్నామన్న పేరుతో దళితులపై దాడులను ఆపడంలో పూర్తిగా విఫలమయ్యింది. పైగా ఆర్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దాడులను ప్రభుత్వంలో ఉన్న మంత్రులు సమర్థిస్తున్నారు. మాటవరుసకు ఓ ప్రకటన వెలువరించడం మినహా గోరక్షకులు పేరుతో ఆర్.ఎస్.ఎస్ చేస్తున్న ఈ దాడులను మోదీ ఖండించకపోవడం ఆయన అంతర్లీనంగా వీటిని సమర్థిస్తున్నట్లు అనుకోవలసి వస్తుంది. ప్రభుత్వం ప్రాపకంతోనే ఆర్.ఎస్.ఎస్ కుల ఘర్షణలను రెచ్చగొట్టే ప్రచారాన్ని కొనసాగిస్తున్నది. ఇది రాజ్యాంగంపై చేసే దాడే. కొద్దివారాలలో మోదీ పాలనకు మూడేళ్ళు నిండిన సంబరాలు జరుపుకుంటారనగా ఉత్తర ప్రదేశ్‌లోని షహరాన్‌పూర్ జిల్లాలోని షబ్బీర్‌పూర్ గ్రామంలో దళితులపై అగ్రకులంవారు అత్యంత హేయంగా దాడికి పాల్పడ్డారు. వారి ఎజెండాలోని హిందూ రాష్ట్రం విషపూరితమైన కులవ్యవస్థ ఇనప కచ్చడాలలో వారిని బంధిస్తుంది. అది క్రింది కులాల వారిని 'వారి స్థానాలలో వారిని' ఉంచాలని శాసిస్తుంది.

ఈ సంవత్సరం ఆదివాసీలకూ గడ్డుకాలమే. మోదీ ప్రభుత్వం తన ఆధ్వర్యంలోని పర్యావరణ, వన, వాతావరణ మంత్రిత్వశాఖ ఆదివాసీలకు అడవిహక్కుల చట్టాన్ని నీరుగార్చే చర్యలు తీసుకుంటున్న అనేక విధానాలను రూపొందించింది. నోటిఫికేషన్స్ విడుదల చేసింది. ఇవిగాక కొన్ని చట్టపరమైన చర్యలను కూడా తీసుకుంది.

కేంద్ర ప్రభుత్వ విధానమైన 'వ్యాపార అనుకూల విధానం' లో భాగంగా ప్రకృతి వనరులను దేశ, విదేశ కార్పొరేట్ సంస్థలకు అప్పచెప్పేందుకు వీలుగా చట్ట సవరణలు చేసింది భారత ప్రభుత్వం. నిజానికి ఆదివాసీల భూమిని ఆదివాసీలు కాని వారికి అమ్మడంపై నిషిద్ధం ఉన్నది. క్రితం సంవత్సరం నుండి ఆదివాసీలను వారి సంప్రదాయ నివాస స్థానాల నుండి తరిమేయడం, సాంస్కృతిక జీవనం నుండి వేరుచేయడం మరింతగా పెరిగింది.

ఈ మూడేళ్ళ పాలన ఉత్సవాలు జరుపుతున్న సందర్భంలోనే ప్రభుత్వం పశు విక్రయాలను దేశవ్యాప్తంగా నిషేధిస్తూ ఒక ఉత్తర్వుని జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వానికి ఆ హక్కే లేదు. రాజ్యాంగంలో ఇటువంటి హక్కులు రాష్ట్ర ప్రభుత్వాల

పరిధిలోనే పొందుపరచబడ్డాయి.

ఈ నోటిఫికేషన్‌ను గుండాగ్యాంగులు 'జంతు సంరక్షణ' పేరుతో మైనారిటీలను భయభ్రాంతులను చేసేందుకు ఒక అనుమతి పత్రంగా ఉపయోగించుకుంటారు. తన మూడవ యేడు పూర్తిచేసుకున్న సందర్భంగా మోదీ ఆర్.ఎస్.ఎస్.కి ఇచ్చిన బహుమానం ఇది.

ఈ నోటిఫికేషన్ ప్రకారం పశువులంటే ఆవులు, దూడలు, ఎద్దులు, గేదెలు, బర్రెలు, పడ్డలు. జంతువులను వ్యవసాయానికి ఉపయోగించడానికి మాత్రమే కొంటున్నట్టు, వధించడానికి కాదని అమ్మేటప్పుడు ధృవీకరించుకోకపోతే అది నేరమవుతుంది. అమ్మే వ్యక్తి వధించేందుకు కాదని ధృవ పరచుకోవలసి ఉంటుంది. కొనే వ్యక్తి ఆరునెలల వరకు ఎట్టి పరిస్థితులలోనూ దానిని అమ్మరాదు. ఈ రకంగా తరతరాలుగా సంతలో పశువులను అమ్ముకునే భారతీయ సాంప్రదాయక వ్యాపారాన్ని 'భారతదేశంలో తయారీ దారులు' వాస్తవంలో పూర్తిగా నిషేధించారు.

ఇది భారతదేశంలోని కోట్లాది పశుపోషకుల జీవనాన్ని నాశనం చేస్తుంది. పాడి ఇవ్వని పశువును పోషించేందుకు రైతుకు సంవత్సరానికి రూ. 14,000/- ఖర్చు అవుతుంది. ఇప్పటికే ఏడాదికి కనీసంగా 12,000 మంది రైతుల ఆత్మహత్యలు నమోదవుతున్న నేపథ్యంలో ఈ భారం రైతులను మరింతగా కుంగదీస్తుంది. వ్యవసాయ సంక్షోభం మరింత పెరుగుతుంది. ఇది భారతదేశానికి పాల ఉత్పత్తులు, పాలపొడి అమ్మే బహుళ జాతి కంపెనీలకు లాభాలను చేకూరుస్తుంది.

ఈ నిర్ణయం మాంసం ఎగుమతిదారులకు కూడా ముఖ్యంగా గొడ్డుమాంసం ఎగుమతులు చేసే వారికి దాదాపు 30,000 కోట్ల రూపాయల నష్టం కలిగిస్తుంది. చిన్న వర్తకులకు ఏర్పడే నష్టాలు ఇందుకు అదనం. తోలు పరిశ్రమపై ఆధారపడ్డ 25 లక్షల మంది ప్రజలు ఇప్పటికే పశువధ నిషేధ చట్టం గట్టిగా అమలు చేయడం వలన ఉపాధి కోల్పోయారు. వారి పరిస్థితి ఇప్పుడు మరింత దిగజారుతుంది.

భారతదేశంలో రక్తహీనత, పోషకాహార లోపం చాలా ఎక్కువ. ఒక్క మైనారిటీలే కాదు. భారతదేశంలో ఎంతోమంది పేదలు గొడ్డు మాంసం తిని పోషకాహారాలు పొందుతారు. గేదెలను కూడా వధించడం నిషేధించినట్టయితే

దాని ప్రభావం ప్రజలకు పోషకాహారం అందుబాటులో ఉండడంపై తీవ్రంగా ఉంటుంది. ఆహారపుటలవాట్లు పూర్తిగా వ్యక్తిగతం. ఈ నోటిఫికేషన్‌తో భారత ప్రజల ఆహారపు అలవాట్లపై ప్రవర్తనా నియమావళిని రుద్దినట్టవుతుంది.

ఈ నోటిఫికేషన్‌లోని వివిధ పార్శ్వాలు మూడేళ్ళ మోదీ పాలనకు అద్దం పడుతున్నది. ఆధిపత్యధోరణి స్వీయ ఆహారపుటలవాట్లతో సహా ప్రజాస్వామ్య హక్కులపై దాడి బయటపడుతున్నది. కార్పొరేట్లకు అనుకూల, ప్రజావ్యతిరేకమయిన వారి విధానాలు తెరలు తొలగి స్పష్టంగా కనిపిస్తున్నాయి. హిందూ రాష్ట్రస్థాపనే ముఖ్య లక్ష్యం అయిన ఆర్.ఎస్.ఎస్ ఎజెండా బట్టబయలవుతున్నది. గోరక్షక గ్యాంగ్‌లకు ఆయుధాలు సమకూరుస్తున్నదందుకే.

ఈ పుస్తకంలో మోదీ పాలనలోని భిన్న పార్శ్వాలను చర్చిస్తాం. అందుకోసం ఎంతోమంది కామ్రేడ్స్ సహకరించారు. కామ్రేడ్ సృజన, సవేరా, శ్యామ్, విజూక్రిష్ణన్, ఆదిర, సబిహ, ప్రబీర్ పురకాయత్స, శృతి, వివేక్, రాజేంద్రశర్మ, డా॥ హేమలత, పి.జి. అంబేద్కర్, ప్రాన్జల్, మురళీధరన్, అజయ్ కుమార్. ఈ పుస్తకం కోసం ప్రత్యేకంగా కార్టూన్లు వేసినవారందరికి మా కృతజ్ఞతలు.

**బృందాకరత్**

*పొలిట్ బ్యూరో సభ్యురాలు*

# మూడేళ్ళ మోదీ పాలన

## ముసుగులు తొలగిపోయాయి :

## మతతత్వ దాడులకు తెరలేచింది

మోదీ ప్రభుత్వం పాలన మూడో యేడు ముగియడంతోనే ఆర్ఎస్ఎస్, బిజెపిల మతతత్వ ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. కాషాయిమూక విభజిత స్వభావానికి సిగ్గుమాలిన రూపమయిన యోగి ఆదిత్యనాథ్‌ని ఒక పెద్ద రాష్ట్రానికి అధినేతను చేయడంతోనే ఇది బట్టబయలయింది. మోదీ నాయకత్వంలో గెలిచిన యుపి పీఠంపై ఆదిత్యనాథ్‌ను కూర్చోపెట్టడం పూర్తిగా ఊహించనిది కాదు. నిజానికి ఇది ఎలక్షన్ ప్రచారం కొనసాగింపే. మోదీ ఆలోచించి తీసుకున్న నిర్ణయమిది. 'కబరిస్థాన్', 'షంమ్‌స్థాన్' అంటూ ప్రచారంలో మోదీయే స్వయంగా చర్చను రేపడం వలన ఈ నియామకం ఎన్నికల ప్రచార కొనసాగింపు అనవలసి వస్తున్నది. నిజానికి ఇది షా & కంపెనీ మతతత్వాన్ని దట్టించి వండిన వంటకం పైపూత మాత్రమే. పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని ముస్లిమ్‌లు అధికంగా ఉన్న ప్రాంతం నుండి 'హిందువుల వలసలు' అన్నది అందులోని మరో అంశం. ఈ అంశాన్నే ఆదిత్యనాథ్ తన ఎన్నికల ప్రచారంలో గట్టిగా చెప్పుకున్నారు. తన ఆధ్వర్యంలోని హిందూ యువ వాహిని ద్వారా పూర్వాంచల్ (ఉత్తర యుపి)ని ముస్లింల బెడదనుండి విముక్తి చేసి ముస్లింలకు వారి స్థానాన్ని వారికి చూపించానని ఆదిత్య నాథ్‌తో చెప్పించారు. ముస్లింలకు ఒక్క స్థానాన్ని కూడా కేటాయించకపోవడం, యాంత్రిక వధ్యశాలలన్నీ మూసి వేస్తానని ప్రకటించడం, లవ్ జిహాద్, తలాక్ వంటివి మరికొన్ని అంశాలు. అయోధ్యలో రామమందిర నిర్మాణం అన్నింటికన్నా ముఖ్యమయినది. ఆర్ఎస్ఎస్, బిజెపిలు దళితులు ఇతర ఒబిసి కులాలయిన జాతవులు, యాదవులతో

కలిసి ఎన్నికలలో గెలిచేందుకు "ముస్లిమ్‌లను బుజ్జగించడం" పైనే ఎక్కుపెట్టారు. ఈ 'ముస్లిమ్‌లను బుజ్జగించడం' అన్న మంత్రం పొంతనలేని అసహజ కలయికలకు విశాలమైన సైద్ధాంతిక పటుత్వాన్ని ఇవ్వడమే కాక అందులో భాగమైయేటట్టు కూడా చేసింది. ఇటువంటి నేపథ్యంలో ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా పైకెత్తబడడం ఆశ్చర్యం కలిగించదు. అయినప్పటికీ ఆదిత్యనాథ్‌ను ఎంపిక చేయడం, మోదీ ఆధ్వర్యంలోని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల విభజించే విధానాన్ని భారతదేశంలోని అత్యధిక జనాభాగల ఒక రాష్ట్రంలో బహిర్గతం చేయడం, అదీ ఎన్నికల వేడి తగ్గిన తరువాత బుద్ధిపూర్వకంగా చేయడం ద్వారా దాని నిజ స్వరూపాన్ని బయట పెట్టేందుకు సంసిద్ధంగా ఉన్నట్టు తెలియజేస్తున్నది. ఇది హిందూత్వ శక్తులకు మోదీ ఇచ్చిన రెండో కానుక. మూడో సంవత్సరం ముగిసే నాటికి ముసుగులు తొలగిపోయాయి.

హిందూత్వ సేనను ఆదిత్యనాథ్ నిరాశ పరచలేదు. ముఖ్యమంత్రిగా పీఠం అలంకరించగానే ముస్లిములు ఎక్కువగా ఆధారపడిన వధ్యశాలలను మూసివేశారు. మాంస విక్రయాలను నిషేధించారు. చట్టవిరుద్ధ వధ్యశాలలపై తీసుకుంటున్న చర్యలు మొత్తం మాంసం ఎగుమతులను, చర్మం ఎగుమతులను ఒడిదుడుకులకు గురిచేసింది. ఇందువలన దీనిపై ఆధారపడ్డ 25 లక్షల ప్రజలు తమ జీవనోపాధిని కోల్పోయారు. కోట్లాది ప్రజలు తమ జీవనాధారమయిన ఆహారాన్ని కోల్పోయారు. దీనిని కొత్త ప్రభుత్వంలోని హిందూత్వ వాదుల అసలు ఉద్దేశంగా కూడా చూడాల్సి ఉంటుంది.

సహజంగానే ఈ విధానాలు కాషాయి మూకలకు కొత్త ఉత్సాహాన్నిచ్చి మరింత దూకుడుగా ముందుకెళ్ళేందుకు ప్రోత్సహించింది. ఫలితంగా వారి విజృంభణతో రాష్ట్రంలో చాలాచోట్ల శాంతిభద్రతలకు భంగం కలిగింది. దాడి చేస్తున్న కాషాయ మూకలను కాక వారిని నిలవరిస్తున్న ప్రదర్శకులపై చాలా చోట్ల పోలీసులు దాడి చేయడం ఇక్కడ కొత్త కోణం. ఇంకా ముఖ్యమయిన విషయం ఏమిటంటే ఆగ్రా, షహరాన్‌పూర్‌లలో దారుణమైన సంఘటనల తరువాత బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థల ఆగ్రహానికి గురయిన సీనియర్ పోలీసు ఆఫీసర్లను ఆదిత్యనాథ్ బదిలీ చేయడం. ఇది రాష్ట్రంలోని పోలీసు శాఖకు తమ కొత్త పాలకులు ఆర్‌ఎస్‌ఎస్ వారేనని వారి ఆజ్ఞ శిరసావహించాలన్న స్పష్టమైన సంకేతాన్ని ఇస్తుంది.

అందువలనే ఆదిత్యనాథ్ ప్రత్యక్ష ప్రాపకంలోని హిందూ యువవాహిని విజృంభిస్తున్నది. ఇదెంతగా పెరుగుతున్నదంటే, దాని పెరుగుదలను ఆపేందుకు

కొత్తగా అందులో సభ్యులను చేసుకునేందుకు, ముఖ్యంగా సంస్థాగత పదవులు ఇచ్చేందుకు కొన్ని నిబంధనలు పెట్టవలసి వచ్చింది. ఈ  ఆదిత్యవాహిని అత్యంత వేగంగా గోరక్‌పూర్ డివిజన్‌నుదాటి పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని అన్ని మతతత్వ సంఘటనలలోనూ తన ఉనికిని ప్రదర్శించింది. బులాంద్‌షెహర్ పక్క గ్రామంలోని ఒక ముస్లిం, ఒక హిందూ మహిళ పారిపోయారన్న నెపంతో, వాహిని సైనికులు మోటర్ సైకిల్‌ను అక్కడి ఒక ముసలి ముస్లిం పైకి ఎక్కించి చంపివేసారు. ఆమ్‌రోహాలో కూడా ఇటువంటి సంఘటనలతో హిందూత్వ సైన్యానికి భయపడి ముస్లింలందరూ వారి గ్రామాన్ని, వారి ఇళ్ళను వదిలి పారిపోయారు. ఇక షహరాన్‌పూర్ ఘటనలను గత నెల రోజులుగా ప్రసారమాధ్యమాలలో చూస్తూనే ఉన్నాం. అక్కడ స్థానిక బిజెపి ఎంపి ఆధ్వర్యంలో హిందూత్వశక్తులు అంబేద్కర్ జయంతి వేడుకలంటూ దళితులను ముస్లింలకు వ్యతిరేకంగా సమీకరించారు. అందులో పాల్గొనని దళితులను మహరాణా ప్రతాప్‌సింగ్ అనే రాజ్‌పుట్‌ల ఆదర్శరాజు జన్మదిన వేడుకలలో పాల్గొనమని బలవంతంచేసి పాల్గొనని వారిపై దాడులకు పూనుకున్నారు. అంతకు ముందు జరిగిన ఎస్ఎస్‌పి ట్రాన్స్‌ఫర్‌ను దృష్టిలో పెట్టుకుని పోలీసు యంత్రాంగం దళితులను రక్షించడంలో వివేకాన్ని ఉపయోగిస్తున్నది. ఇటువంటి పరిస్థితిలో ముఖ్యమంత్రిగా ఉన్న ఆదిత్యనాథ్, 2007లో మతఘర్షణలను, అల్లర్లను రెచ్చగొడుతున్నారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న అప్పటి పార్లమెంటు సభ్యుడైన ఆదిత్యనాథ్‌పై చర్యలు తీసుకునేందుకు అనుమతి ఇవ్వకపోవడంలో ఆశ్చర్యం ఏముంది? ఆదిత్యనాథ్ అతని అనుచరగణం పై ఇటువంటి కేసులు కోకొల్లలు. అన్ని ప్రకంపనలతోనూ ఆదిత్యనాథ్ యుపి గద్దెనెక్కడం ఒకటే మోదీ ప్రభుత్వ మూడేళ్ళ పాలనలో హిందూత్వ వాదుల సాఫల్యం. మొదటి యేడు ప్రారంభించబడిన ప్రతిదీ అంతకుమించిన వేగంలో మూడవ యేడూ కొనసాగాయి. ఇందుకు మూడు ఉదాహరణలు చాలు. 90% అబద్ధాలని ప్రధాని మోదీ కొట్టి పడేసినా, 'గోరక్షకులు వారి కార్యకలాపాలను విస్తృతపరిచారు. పరిధిని పెంచారు. వేగాన్ని పెంచారు. దాడుల తీవ్రతనూ పెంచారు. ఈ మధ్యనే జరిగిన ఒక సంఘటనలో రాజస్థాన్‌లోని అర్‌వార్‌లో పెహ్లుఖాన్ అనే హర్యానాలోని మేవత్‌కు చెందిన ముస్లిం పశుపోషకుడిని గోరక్షకులు దారుణంగా కొట్టి చంపారు. ఆయన జయపూర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పశువుల సంతలో ఆవును కొనుక్కున్నారు. ఆయన వద్ద అందుకు సంబంధించిన రసీదు ఉంది. ఆ పశువును తరలించుకుపోతున్న క్రమంలో జాతీయ రహదారిపై గోరక్షకులు వారిపై దాడి చేశారు. అన్ని బిజెపి పాలిత రాష్ట్రాలలో

సర్వసాధారణంగా జరిగేట్టుగానే ఇక్కడా బాధితుడిపైనే పశువును అక్రమంగా తరలిస్తున్నట్టు పోలీసులు కేసు నమోదు చేసి అసలు నిందితులను విడిచి పెట్టారు. పెహ్లూఖాన్ మృతిచెందడం వలన దేశం మొత్తం హాహాకారాలు చేసినా బిజెపి ప్రభుత్వం మాత్రం మిగిలిన బాధితులపై మోపబడ్డ ఆరోపణలను వెనక్కు తీసుకోలేదు. రాజస్థాన్, హర్యానాలలోని బిజెపి ప్రభుత్వాలు బాధితులకు ఏరకమయిన సహాయాన్నిగాని, పరిహారాన్ని గాని ఇచ్చేందుకు సిద్ధపడలేదు. నిజానికి పెహ్లూఖాన్ మృతి తరువాత హర్యానా, జార్ఖండ్ ఇంకొన్ని రాష్ట్రాలు, సంఘ్‌పరివార్ పాలనా విధానాలను ప్రతిఫలింపచేస్తూ, 'గోరక్షణ'ను మరింత పకడ్బంధీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నాయి.

ముస్లిం మైనారిటీలపై 'రక్షకుల' దాడులు జాతీయ మైనారిటీ కమిషన్ ఛైర్‌పర్సన్ సఫీమ్ అహమ్మద్ 2016 చివర్లో హెూంమంత్రి రాజనాథ్ సింగ్ దృష్టికి తీసుకుని వెళ్ళేటట్టు చేసాయి. 'రక్షకులని పిలవబడేవారు ముస్లిం మైనారిటీలపై చేస్తున్న దాడులు పెరగడాన్ని' అది దేశవ్యాప్తంగా భయభ్రాంతులను సృష్టించడాన్ని మేం మీ దృష్టికి తేదలిచాం. ఈ కమిషన్ బాధితులనుండి అనేక పిటిషన్‌లను అందుకుంది. మేం వీటికి సంబంధించిన ఒక రిపోర్టును కూడా తయారు చేసాం. బాధితులు ఒక్కోసారి పోలీసుల ఉదాసీనతకు కూడా లోనయ్యారు. ఇది దేశ సామాజిక జీవితాన్ని చెడగొడుతుంది. రెండు మతాలవారు సహజీవనం చేసే వాతావరణాన్ని భగ్నం చేస్తుంది. ముఖ్యంగా ముస్లిములలో దేశవ్యాప్తంగా అభద్రతను, అపనమ్మకాన్ని పెంచి తరతరాలుగా సఖ్యతతో శాంతియుతంగా మెలుగుతున్న రెండు మతాల మధ్య స్నేహాన్ని నీరుగారుస్తుంది. దేశంలోని అత్యున్నత స్థానంలో ఉన్నవారి దగ్గరనుండి ఒక బలమైన ప్రకటన – "ఈ ప్రభుత్వం 'చట్టరహితమైన చర్యలను సహించదని, అవి శిక్షించబడకుండా ఉండవని, భారతదేశ లౌకిక విలువలు రక్షించబడతాయని" వెలువరించవలసిన అవసరం ఉందని మేం భావిస్తున్నాం'. ఈ ఉత్తరం ఉనాలో దళితులపై దాడులు జరిగిన నెలరోజుల తరువాత మోదీ బహిరంగంగా గోరక్షకులమని చెప్పుకునే వారి చర్యలను ఖండించిన తరువాత వ్రాయబడింది. అయితే మోదీ గారికి యుపిలో జరగబోయే ఎన్నికలో ముస్లిం ఓటర్ల ఓట్లు అవసరం లేదు. అందువలన దేశంలోని 'అత్యున్నత స్థానం నుండి' ముస్లింలపై జరుగుతున్న దాడులపై ఏరకమయిన ప్రకటనా వెలువడలేదు.

నిజానికి ఆర్ఎస్ఎస్ గణాంకాలను చూపి తన దాడులను మరుగు పరచాలనుకుంటున్నది. మోదీగారి భారతదేశంలో మతతత్వదాడుల సంఖ్య పెద్దగా పెరగలేదు కాబట్టి మైనారిటీలు భయపడుతున్నారంటున్న విమర్శలు ఉద్దేశపూర్వకంగా చేసేవే అని వారి వాదన. కాని హోమ్ మంత్రిత్వ శాఖ ఇచ్చిన గణాంకాల ఆధారంగా మత ఘర్షణలు పెరిగాయే గాని తరగలేదు.

అయితే ఈ అంకెలు కూడా హింసాత్మకంగా మారిన సంఘటనలను పోలీసులు రికార్డు చేసుకున్నవే. ఇవికాక సంఘ్‌పరివార్ వారు మైనారిటీలపై చేస్తున్న చిన్నాచితకా దాడులు, కొట్టడాలు, ఆస్తులను ధ్వంసం చేయడాలు, ప్రార్థనా స్థలాల విధ్వంసం, బెదిరింపులు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని మతపరమైన దాడులుగా రికార్డు చేయకపోవడం వలన అవి హెూం మంత్రిత్వ శాఖ రికార్డులలో ఆ రకంగా నమోదు కాలేదు.

## మత ఘర్షణలు 2012-2016

| సంవత్సరం | సంఘటనలు | చనిపోయినవారు | గాయపడినవారు |
|---|---|---|---|
| 2012 | 668 | 94 | 2117 |
| 2013 | 823 | 133 | 2269 |
| 2014 | 644 | 95 | 1921 |
| 2015 | 751 | 97 | 2264 |
| 2016 | 703 | 86 | 2321 |

ఈ దేశంలోని అనేక ప్రాంతాలలో నివసిస్తున్న మైనారిటీలు ముఖ్యంగా ముస్లిమ్‌లు భయంతో అభద్రతతో రోజులు వెళ్ళదీస్తున్నందుకు గణాంకాలకు అందని ఎన్నో కారణాలు ఉన్నాయి. అందులో గోమాతను రక్షించే నెపంతో ముస్లిమ్ వ్యవసాయదారులు, పశుపోషకులపై గోరక్షకులకు ఇచ్చిన లైసెన్స్ ఒకటి. ఆ ఘర్షణలలో, ఒక్కొక్కసారి హిందూ రైతులకు దెబ్బలు తగలవచ్చు. చనిపోవచ్చుకూడా. ఇందుకు సంబంధించిన మరో అంశం సంఘ్‌పరివార్ గుండాలు యుపిలో ఎన్నికలలో గెలిచిన తరువాత గోమాంస పరిధిని పశుమాంసానికి పెంచి దానిని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయడం. రకరకాల మత సాంప్రదాయులను అడ్డం పెట్టుకుని ప్రదర్శనలు చేయడం, ఆయుధాలను చేతపట్టడం. నిజానికి సంఘ్‌పరివార్ యుపి, బీహార్‌లలో 'శివచర్చ', 'రామకథబాట' అంటూ స్థానిక ప్రజలలో మత పట్టింపులు పెంచే ప్రచారం చేస్తూనే ఉన్నారు. వీటికి రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ఎన్నికలలో

గెలుపు తక్షణ ప్రయోజనం. దీర్ఘకాలంలో ఈ దేశ భిన్నత్వాన్ని దెబ్బకొట్టి వైరము, దురహంకారము ఆధారంగా గల బ్రాహ్మణాధిక్య హిందూత్వాన్ని స్థాపించడం.

సంకుచితమైన, విరోధాల ఆధారంగాగల సంఘ్‌పరివార్ సిద్ధాంతాలను మోదీ ప్రభుత్వం కుహనా జాతీయ వాదానికి సైన్యంలోనూ, పారామిలిటరీ దళాలలోనూ 'అభిమానాన్ని' సైనికీకరణకు ఉపయోగపెట్టుకుంటున్నది. ఉగ్రవాదాన్ని అణచడంలో విఫలమయిన మోదీ ప్రభుత్వం సంఘ్‌పరివార్, వారి భజనరాయుళ్ళైన ప్రచార మాధ్యమాల అండదండలతో రాజ్యహింసను కీర్తిస్తున్నాయి. ఇందులోనూ ఒక ఎజెండా దాగి ఉన్నది. ఆదెప్పుడూ ముస్లింలను, పాకిస్థాన్నే లక్ష్యం చేస్తున్నది. తద్వారా దేశం అంటే హిందువులదేననే తప్పుడు సంకేతానికి ప్రేరేణను కలిగిస్తున్నది.

కాశ్మీర్‌లో జరుగుతున్నదంతా కూడా హిందూత్వవాదుల సాఫల్యాలే! కాశ్మీర్ పరిస్థితి మున్నెన్నడూ లేనంత దిగజారింది. ఆఖరికి లోయలో సాధారణ ప్రజానీకం తిరుగుబాటుచేసే స్థాయికి చేరింది. శ్రీనగర్ పార్లమెంటు బై ఎలక్షన్‌లో 7% ఆ తరువాతి రీపోలింగ్‌లో 3% ప్రజలు మాత్రమే అనేక పోలింగ్ బూత్‌లలో పాల్గొనడం కాశ్మీర్ ప్రజలు ఎంతగా వేరుపడిపోయారో తెలియజేస్తుంది. కానీ మోదీ ప్రభుత్వానికి ఇదేం పట్టదు. అంతేకాదు ఇది పిడిపి బిజెపి సంకీర్ణం పేరుతో మెహబుబా ముఫ్తీ చేతులకు సంకెళ్లు వేసింది. ఆమె అనేకసార్లు సంబంధిత శ్రేణులందరితో చర్యలు ప్రారంభించమని కోరుకున్నా మోదీ గారికి ఏ మాత్రం పట్టలేదు. ఇది కాశ్మీరు ప్రజల నమ్మకాన్ని పొందడానికి అందరితో చర్చలు జరుపుతామని హోంమంత్రి నాయకత్వంలోని ఓ పార్లమెంటరీ ప్రతినిధి బృందం కాశ్మీర్‌లో పర్యటించి ప్రకటించిన తరువాత జరిగిన సంగతి. 'దృఢత్వం' అన్నది కాశ్మీర్‌కి సంబంధించిన మోదీ ప్రభుత్వ విధానం. ఒక రాజకీయ సమస్యను సైనికచర్యలతో పరిష్కరించగల మనుకుంటున్నదీ ప్రభుత్వం. ఇవి విఫలంకాక తప్పదు. అయితే ఈ వైఫల్యం కూడా హిందూత్వ శక్తుల సాఫల్యమే. ఎందుకంటే కాశ్మీర్‌లో ఈ కల్లోల పరిస్థితులలో కూడా దేశంలో, ముఖ్యంగా జమ్ములో మతతత్వాన్ని పెంచేందుకు ఉపయోగించుకుంటున్నదీ ప్రభుత్వం. ఈ మతతత్వవాదులకు పాకిస్థాన్ బయటి దేశం అయితే కాశ్మీర్ దేశంలో ఉన్న ఇతర దేశం.

దేశంలోని లౌకిక, పరిశోధక విద్యార్థుల మీద, ముఖ్యంగా జెఎన్‌యు లాంటి అత్యున్నత విశ్వవిద్యాలయ విద్యార్థుల మీద దాడులు చేయడం హిందూత్వ

శక్తుల మరో విజయం. మోదీ రెండవ ఏటి పాలనలో వామపక్ష విద్యార్థి కార్యకర్తలమీద, వారి చర్యల మీద ప్రత్యక్ష కార్యాచరణకి పూనుకుంటే మూడవ యేడు ముగిసేనాటికి ఈ విశ్వవిద్యాలయాలలో ప్రవేశాన్నే అడ్డుకోవడం చూస్తున్నాం. ప్రస్తుతం అమలయిన ఈ దాడి ముందు దాడులకన్నా సఫలమయినది. సహజంగానే నెమ్మదిగా ప్రజాస్వామ్య వాతావరణం విద్యా విధానంలో నాశనం చేయబడుతున్నది. ప్రతిచోట ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నిండిపోయారు. ఇందుకు సరికొత్త ఉదాహరణ IMC (ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్) ఈ సంస్థ జాతీయ జర్నలిజంపై ఒక సదస్సును నిర్వహించనున్నది. అందులో చత్తీస్ఘర్‌లో వివాదాస్పదమైన ఒక పైస్థాయి పోలీసు అధికారి కల్లోరి పాల్గొన్నారు. ఆ తరువాత రెండు గంటలు 'యజ్ఞం' జరిగింది. ఇదంతా ఆర్ఎస్ఎస్ నిర్దేశించిన విద్యావిధానంలో భాగమే. ఇది ఇంకా చర్చలలో ఉందని బయటకు చెప్తున్నా వాస్తవానికి పూర్తిగా అమలవుతున్నది. ఇది ఖచ్చితంగా ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు ఆదేశించిన విధానమే. సాంస్కృతిక విభాగాల పరిస్థితి కూడా భిన్నంగా లేదు. తేడా అల్లా వ్యాపారీకరణ చేయడంతో పాటు వ్యాపారీకరణ అవ్వడం కూడా. ఫలితంగా ఈ సంస్థలు బలహీనపడుతున్నాయి. వాటి పరపతి దెబ్బతిని పోతున్నది. ఆర్ఎస్ఎస్ మద్దతున్న 'గర్భసన్‌స్కార్'ను బిజెపి రాష్ట్ర ప్రభుత్వం బలపరుస్తున్నదంటే గిమ్మిక్కులను సైన్సుగా బలపరచడమే. దీనివలన భారతదేశ శాస్త్రజ్ఞానం పరిహాసానికి గురవుతుంది. ఇది ప్రపంచం అసహ్యించుకునే జర్మనీలోని హిట్లర్ యొక్క జాతి ఔన్నత్య కార్యక్రమానికి ఉత్తేజితులయినట్టుగా ఉంది.

ఈ మధ్యనే జరిగిన ఎన్నికలలో విజయాలు, ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్‌లోని విజయంతో ఆర్ఎస్ఎస్, బిజెపిలు వామపక్షాలపై ముఖ్యంగా సిపిఐ (ఎమ్) పై దుష్ప్రచారాన్ని ముమ్మరం చేసాయి. 'హిందూ రాష్ట్రంగా' భారతదేశాన్ని మార్చడాన్ని పూర్తిగా వ్యతిరేకించే వామపక్షాలే వారి ముఖ్య సైద్ధాంతిక శత్రువులు. అందుకే వారినే తమ ప్రధాన శత్రువులుగా గురి చేసుకుంటున్నాయి. రెండోది, ఆర్ఎస్ఎస్ అధినాయకుడు, సైద్ధాంతిక కర్త గోల్‌వాల్కర్ వారి ప్రధాన విరోధులుగా కమ్యూనిస్టులనే గుర్తించారు. ఆ తరువాతే ముస్లింలు, క్రిష్టియన్లు. సహజంగానే వామపక్షాలు బలంగా ఉన్న ప్రాంతాలనే తమ లక్ష్యాలుగా చేసుకున్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రారంభమయిన నాటి నుండి ఆర్ఎస్ఎస్ సిపిఐ (ఎమ్)పై దాడులను ముమ్మరం చేసింది. అదే సమయంలో కేంద్రంలో వారి అధికారాన్ని

ఉపయోగించుకుని తామే బాధితులుగా తప్పుడు ప్రచారం చేసుకుంటున్నది. అదే సమయంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు కమ్యూనిస్టు వ్యతిరేక మతతత్వ, కులతత్వ శక్తులను కూడగట్టే ప్రయత్నంలో ఉన్నాయి. వచ్చే ఏడాది త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సిపిఐ(ఎమ్) అక్కడ వరుసగా ఏడు పర్యాయాలు ఎన్నికలు గెలిచిన చోట ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు కమ్యూనిస్టు వ్యతిరేక కూటమిని తన చుట్టూ ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేస్తున్నది. టిఎమ్‌సిని వాస్తవానికి కబళించేసారు. ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ స్థానాన్ని ఆక్రమించారు. వామపక్ష వ్యతిరేక సంఘటనను ఏర్పాటు చేయడానికి గిరిజన వేర్పాటు సంఘాలతో పొత్తు పెట్టుకుంటున్నారు. ఇది గిరిజనులకు గిరిజనేతరులకు మధ్య చిచ్చు రేపే ప్రమాదానికి దారితీస్తుంది. నిజానికి త్రిపురలో వామపక్ష ప్రభుత్వం గిరిజనులకు గిరిజనేతరులకు మధ్య ఐక్యతను సాధించినందువలననే మిగిలిన ఈశాన్య రాష్ట్రాలు అశాంతిలో రగులుతున్నా, త్రిపురలో శాంతి భద్రతలు ఉన్నాయి. ఇక బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మైనారిటీలకు మద్దతునివ్వడాన్ని అవకాశంగా తీసుకుని బిజెపి మెజారిటీ అంశాన్ని ముందుకు తీసుకుని వచ్చి వామపక్షాలను వెనక్కునెట్టే ప్రయత్నం చేస్తున్నది. ఈ ప్రచారం మోదీ ప్రభుత్వ నాల్గవ ఏట మరింతగా పెరిగే అవకాశం ఉన్నది.

మూడేళ్ళ మోదీ పాలన ముగియడంతోనే ముసుగులు తొలగిపోయాయి. ఆర్థిక వ్యవస్థ వాస్తవంలో దుస్థితిలో ఉండడం, నిరుద్యోగం రోజురోజుకీ పెరగడంతో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల పాలనలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి జరుగుతుందన్న



వాదన సరికాదని బహిర్గతమవుతున్నది. అందువలన దానికి మరింత బాహాటంగా తన నిజస్వరూపమైన మతతత్వాన్ని బయటపెట్టి ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఏర్పడింది. ప్రజాతంత్ర లౌకిక వాదులు మరిన్ని సవాళ్ళను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి.

✶

# మూడేళ్ళ మోదీ పాలన
## రాజ్యాంగ హక్కులపై నిరంతర దాడి

2014 మే లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి వారికి గల 282 మంది పార్లమెంటు సభ్యులలో ఒక్క ముస్లిం గాని, క్రిస్టియన్‌గాని పార్లమెంటు సభ్యులు లేరు. నిజానికి సిక్కు మతస్థుడైన ఎస్.ఎస్.అహ్లువాలియాను, బౌద్ధుడైన తుప్‌టాన్ ఛెవాగ్‌ను హిందువేతర ప్రతినిధులుగా చూపించుకొనవలసి వచ్చింది. 20% మైనారిటీలు ఉన్న దేశంలో వారికి ప్రాతినిధ్యం వహిస్తూ పార్లమెంటులోని మెజారిటీ పార్టీలో అన్ని తరగతులవారు ఉంటారని అనుకుంటాం. అసలు ప్రజాస్వామ్యం ప్రాముఖ్యతే అందరికీ అధికారంలో భాగస్వామ్యం ఉందన్న భావన. అయితే బిజెపికి ఇటువంటి సున్నితమైన అంశాల పట్ల నమ్మకం లేదు. మూడేళ్ళ తరువాత జనాభాలో పదో వంతు ముస్లిమ్‌లు ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో ముస్లిమ్ అభ్యర్థులను పెట్టాలన్న డంబాన్ని కూడా ప్రదర్శించదలుచుకోలేదు. ఇక సందేశం సుస్పష్టం. బిజెపి పథకంలోనే మైనారిటీలకు స్థానంలేదు. 'అందరితో కలిసి' (సబ్‌కాసాథ్)లో వీరికి స్థానం లేదు.

మోదీ ప్రభుత్వం దృష్టిలోనే అప్రజాస్వామిక స్వభావ పద్ధతుల మూలాలున్నాయన్న వాస్తవం అతని 3 ఏళ్ళ అధికారంలోని అనేక చర్యలు మనకు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. అది వ్యక్తుల హక్కుల విషయమా, రాజకీయ రణరంగమా అన్న తేడా లేకుండా మోదీ ప్రభుత్వం, దాని మూలమయిన బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ప్రజాస్వామ్య పద్ధతులను అణగద్రొక్కేందుకు ఒక్కక్షణం కూడా ఆలోచించరు.

గడచినవి మూడేళ్ళేగాని ప్రజాస్వామ్యాన్ని వారు ఉల్లంఘించిన సంఘటనలు కోకొల్లలు. తిరుగులేనివి. అందులో అతి ముఖ్యమయినది ఈ ప్రభుత్వం చలామణీలో

ఉన్న నోట్లలో 90% నోట్లను చిత్తు కాగితాల కింద మార్చిన వైనం. ఈ పుస్తకంలో వేరొక వ్యాసంలో దాని వలన కలిగిన దుష్ఫలితాల గురించి చర్చించబడుతుంది. కాని ఆ లాభనష్టాలను పక్కన పెట్టినా, ఈ చర్య వెనక ఆధిపత్య ధోరణి మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ప్రజలతోనో, పార్లమెంటుతోనో, బిజెపి మిత్ర పక్షాలతో కాదు కదా కనీసం తన కాబినెట్‌లో కూడా చర్చించకుండా ఇంత విధ్వంసకర తప్పుడు నిర్ణయాన్ని మోదీ కొందరు తొత్తులతో కలిసి తీసుకునేందుకు సిద్ధపడ్డారు.

అదే అప్రజాస్వామ్య పద్ధతితో తమకు మణిపూర్, గోవా రాష్ట్రాల ఎన్నికలలో మెజారిటీ రాకపోయినా ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి పూనుకున్నారు. గవర్నర్‌లు సాధారణంగా సానుకూలంగా ఉంటారు. కాని గోవా గవర్నర్ ఏకంగా అరుణ్ జెట్లీతో చర్చించినట్టు రికార్డులో నమోదయ్యింది!!! ప్రజల తీర్పు ఒక అసంబద్ధ విషయంగా మార్చబడింది. అంతకుముందు, క్రితంసారి పాలనా కాలంలో ఉత్తరాఖండ్‌లో ప్రభుత్వాన్ని పడదోయడం, మొన్నామధ్య అరుణాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మార్చేయడం చూసిన తరువాత ఈ చర్య ఎవరికి ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కాని ప్రజాస్వామ్య పద్ధతుల పట్ల ఆ పార్టీ దురహంకారాన్ని ఈ చర్యలు మరింతగా నొక్కి చెపుతున్నాయి.

ఆధార్‌ను ప్రజలపై రుద్దడాన్ని ఈ ప్రభుత్వ ఆధిపత్య ధోరణికి మరో ఉదాహరణగా మనం చూడవచ్చు. ఆధార్‌ను సంక్షేమ పథకాలకు తప్పనిసరి చేయవద్దన్న కోర్టు మధ్యంతర ఉత్తర్వులను ఏమాత్రం పట్టించుకోకుండా, చివరి తీర్పు వచ్చేవరకు ఆగకుండా ఆధార్‌ను వాస్తవంలో సంక్షేమ పథకాలకు అనుసంధానం చేసింది. అసలు ఆధార్ చట్టం తయారవుతున్నప్పుడే ఏరకమైన వ్యతిరేకతను, అసమ్మతిని పరిగణలోనికి తీసుకోకుండా ప్రభుత్వం ప్రజలపై రుద్దింది.

భూసేకరణ బిల్లు అనుభవం తరువాత, రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందడం సాధ్యపడదని గ్రహించిన ప్రభుత్వం, దానిని ద్రవ్యబిల్లుగా ప్రవేశపెట్టి రాజ్యసభకు ఆపే అవకాశాం లేకుండా చేసింది. ఎంతోమంది రాజ్యాంగ నిపుణులు దీనిని రాజ్యాంగ ఉల్లంఘన అన్నా, ఆధార్ ఎట్టి పరిస్థితులలోనూ ద్రవ్యబిల్లు కాజాలదని గగ్గోలు పెట్టినా అన్నీ చెవిటివాని ముందు శంఖం మోతగానే మిగిలాయి.

ఇదే ఆధిపత్య ధోరణి విద్యాసంస్థలకు ప్రభుత్వ నియామకాలలోనూ ముఖ్యంగా ఇటీవల ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ విషయంలోనూ స్పష్టమయింది. ఇప్పుడీ సంస్థ అధిపతి బ్రజ్‌బెహారీ కుమార్ ప్రకటించిన భావాలు

– ప్రధాన మంత్రులందరిలోనూ మోదీలకు అత్యుత్తముడు, ఆయనే అసహనానికి బలిపశువు; ఇప్పుడున్న కులవ్యవస్థ, అంటరానితనం అరబ్బుల, తుర్కుల, మొఘల్‌ల దాడుల వలన ఏర్పడ్డవే. మెకాలే, మార్క్సిస్టులు భారతదేశ విజ్ఞాన పతనానికి కారకులు; జెఎన్‌యు విద్యార్థులను విపక్షాలు సమర్థించడంతో భారతీయుల మనోభావాలు దెబ్బతిన్నాయి వగైరా. కుమార్ గారి అర్హతలు జాతీయంగా గాని అంతర్జాతీయంగా గాని, ఆయనకు ఉన్న గుర్తింపును గాని పట్టించుకోవలసిన పనేలేదు! ఆయన కేవలం మోదీ భక్తుడు! అదిచాలు!! మధ్య యుగాలలోని ఒక మహారాజులాగా కుమార్‌ను మోదీ ప్రభుత్వం నియమించింది. ఇలాగే మరెన్నో విద్యా తదితర సంస్థలకు, ఉదాహరణకు ఫిల్మ్ సెన్సార్ బోర్డుకు, మోదీ ప్రభుత్వం నియమకాలు చేసింది.

సంఘ్ పరివార్ అనుసరిస్తున్న ఈ నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలు మైనారిటీల, విరుద్ధ అభిప్రాయాలు గలవారి గొంతులు నొక్కేందుకు ఉద్దేశించినవే. భౌతికదాడులకు తెగబడడం ఈ ప్రభుత్వం మొదటి సంవత్సర పాలనలోనే హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ సంఘటనలో కనిపించింది. మూడో యేడూ అవి కొనసాగుతున్నాయి. భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణకు కేంద్రాలుగా ఉండాల్సిన ఈ విశ్వవిద్యాలయాలకు నిధుల కేటాయింపులను తగ్గించి వాటిని నిర్వీర్యం చేస్తున్నది.


విశ్వవిద్యాలయాలకు ఆవల కూడా నిరంతరంగా సైనికీకరణను, జాతీయ వాదాన్ని ప్రోత్సహిస్తున్నది. తమ వాదనను కాదన్న ప్రతివాడినీ దేశ ద్రోహిగా చిత్రీకరిస్తున్నది. మన ముందున్నవి రెండే దారులు. ఒకటి మోదీ భజన సంఘ్‌పరివార్‌లో భాగం కావడం లేదా జాతి వ్యతిరేకులుగా ముద్ర వేయించుకోవడం అనే స్థితికి ప్రజలను నెట్టే ప్రయత్నం చేస్తున్నది. ఇంతకంటే అప్రజాస్వామిక మైనది వేరే ఏదైనా ఉన్నదా? పాకిస్థానీ కళాకారులు భారతీయ సినిమాలలో నటించకూడదన్న దాన్ని వ్యతిరేకించిన వారందరిపై ఈ రకమయిన తప్పుడు నేరాన్నే మోపారు.

మోదీ నాయకత్వంలోని బిజెపి విధానాల అప్రజాస్వామిక నిజస్వరూపం ఉత్తర ప్రదేశ్ ఎన్నికలలో గెలిచిన తరువాత వధ్యశాలలను మూసి వేయడంలో మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. అనుమతి లేని వధ్యశాలలను మాత్రమే మూసివేయడం అని పైకి చెపుతున్నా వారు లక్ష్యం సుస్పష్టం. మోదీకి ఏమాత్రం మమకారం లేనివారు ఈ వ్యాపారంలో ఎక్కువగా ఉండడమే అసలు కారణం.

ఉత్తర ప్రదేశ్‌లో తిరుగుతున్న 'రోమియో వ్యతిరేక సైన్యం', వీరికి వ్యక్తుల హక్కులు, ఎంపికల మీద ఏమాత్రం నమ్మకం లేదని మరోమారు రుజువు చేస్తున్నది. మధ్య యుగాలలో లాగా వారి అభిప్రాయాలను అవసరమైతే బలవంతంగానైనా రుద్దుతారు.

ఇవేవీ మనకు ఆశ్చర్యాన్ని కలిగించవు. మోదీ ప్రభుత్వం ప్రారంభ రోజుల్లోనే, ఆయన ప్రధాన కార్యదర్శి ఎంపికే ఆనాటి చట్టానికి వ్యతిరేకంగా జరిగింది. హర్యానా, రాజస్థాన్‌లలోని పంచాయితీ ఎన్నికలలో పాల్గొనేందుకు కనీస విద్యార్హతను పెట్టి జనాభాలో అత్యధికులుగా ఉండే మహిళలు, దళితులు, ఆదివాసీలు ఎన్నికలలో పాల్గొనకుండా చేసిన ఘనత సంఘ్‌పరివార్‌దే. ప్రజాస్వామ్యం అంటే వీరికెంత కినుకో దీని ద్వారా మనకు అర్థం అవుతుంది. ఇవేవీ మనకు ఆశ్చర్యాన్ని కలిగించకపోయినా ప్రజాస్వామ్యానికి విలువనిచ్చే వారందరూ ఈ ఆగడాలు ఇంకా మితిమీరక ముందే వీటిని ఎదుర్కొనేందుకు సన్నద్ధులు కావాలి.

★



# మూడేళ్ళ మోదీ పాలన

## అష్టకష్టాలు పడుతున్న దళితులు

మోదీ ప్రభుత్వం తన మూడేళ్ళ కాలాన్ని పూర్తి చేసుకుంది. బిజెపి అధికారంలోకి వచ్చింది 'అందరితో అందరి అభివృద్ధి' అన్న నినాదంతో. కాని వాస్తవానికి జరుగుతున్నది 'పెట్టుబడి దారుల అభివృద్ధి – పేదల వినాశనం'. మోదీ తాను వెనుకబడ్డ తరగతి నుండి వచ్చినట్టు చెప్పుకుంటూ తిరిగారు. ప్రాంతీయ తత్వ రాజకీయాలతో చెలగాటమాడారు. ఇదంతా ఓట్లు సంపాదించేందుకే. ఇవన్నీ డంబాలే.

ఈ మూడేళ్ళ కాలం అంచులకు నెట్టివేయబడ్డవారు – షెడ్యూల్డ్ కులాలవారు, షెడ్యూల్డ్ తెగలవారూ, మైనారిటీలు – ఎటువంటి ప్రయోజనాలనూ పొందలేకపోయారు. 'గోవు' కంటే హీనమయిన స్థానాన్ని పొందారు. కాని వీరి దుశ్చర్యలు ఈనాటి పాలనలోని ప్రచార మాధ్యమంలో చోటు చేసుకోలేదు. అంతా మాటల గారడీలు.

బిజెపి 2014 ఎన్నికల మానిఫెస్టోలో ఏంచేస్తానని చెప్పింది, ఏం చేసిందీ పోల్చి చూస్తే దీని అస్థవ్యస్థ పాలన బట్టబయలు అవుతుంది.

"బిజెపి మానవ విసర్జనలను మానవులు తొలగించడాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుబడి ఉంది."

ఇది వాస్తవానికి ఎంతో దూరంగా ఉంది. 2017–18 బడ్జెట్‌లో 'మానవ విసర్జనలను మనుషులు తొలగించడం నిర్మూలించడానికి కేటాయింపులను సగానికి సగం ప్రభుత్వం తగ్గించింది. పదికోట్ల నుండి 5 కోట్లకు. 2011 సెన్సస్ ప్రకారం దేశంలో 26,07,612 బహిర్భూములు ఉన్నాయి. మానవ విసర్జన శుభ్రంచేసే ఈ అమానవీయ పనిలో 2,00,000 మంది ఉన్నారు. రైల్వే లైన్లను, సూయర్స్‌ను

శుభ్రం చేసే వారిని కలుపుకుంటే వీరి సంఖ్య మరింత పెరుగుతుంది. వీరికి పునరావాసం కల్పించేందుకు ఒక్కొక్కరికి ఇచ్చే రూ. 40,000 ప్రోత్సాహకాన్ని అందరికీ అందజేయాలంటే రూ.800 కోట్లు అవసరమవుతాయి. 2016 ఫిబ్రవరి 15 నాటికి కేవలం 7573 మంది మాత్రమే పునరావాసం కల్పించబడ్డారు. అంటే 1,92,427 మందికి, ఇంకా పునరావాసం కల్పించాల్సి ఉంది. మోదీగారి 'స్వచ్ఛభారత్' కార్యక్రమంలో ఎన్ని బహిర్భూములు తొలగించబడ్డాయో లేదా వాడుక ఆగిందో అనే దాని గురించిన గణాంకాలు అందుబాటులో లేవు.

'మేం దళితుల రక్షణకు ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టిలపై దాడులను నిరోధించడానికే ప్రాముఖ్యతను ఇస్తాం.'

బిజెపి అధికారంలోకి రాగానే హిందూత్వశక్తులకు ధైర్యం మరింత పెరిగింది. పైన ఇచ్చిన ఎన్నికల వాగ్దానం నీటిమూటే. షాహరాన్‌పూర్ బాధితుల మాటల్లో "మేం ఎన్నికల వరకు హిందువులమే. ఆ తరువాత అంటరానివారం." వీరి పాలనలో దళితులపై దాడులు తీవ్రతరమయ్యాయి. ఈ మధ్య షాహరాన్‌పూర్‌లో జరిగిన ఘటనలు చూస్తే దళితులు గనక తమ గౌరవాన్ని నిలుపుకునే ప్రయత్నం చేసారో వారిపై దాడులు జరపబడతాయి. సమాజంలోని కుల కట్టుబాట్లకు అనుగుణంగా వారు వారి పరిధిలో ఉంచబడతారు.

మే 5వ తేదీ షాహరాన్‌పూర్‌లోని ఠాకూర్‌లు మహరాణా ప్రతాప్‌సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రదర్శనకు అనుమతి కోరగా పాలనా విభాగం అందుకు తిరస్కరించింది. వీరిలో ఒక భాగం షబ్బీర్‌పూర్ దళిత బస్తీ గుండా పెద్దపెద్ద నినాదాలు చేస్తూ దళితులను రెచ్చగొడుతూ సభాస్థలిని చేరేందుకు ప్రదర్శనగా బయలుదేరారు. ఇందుకు దళితులు అభ్యంతరం చెప్పారు. ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టుకుంటామంటే ఠాకూర్లు తిరస్కరించిన విషయం ఇక్కడ మనం గుర్తించాలి. దీనిని పరిపాలనా విభాగం అనుమతించలేదు. ఈ నేపథ్యంలో దళితుల అభ్యంతరాలు సరైనవే. అగ్ర కులస్థుల అహంభావాన్ని, గడసరితనాన్ని వ్యతిరేకించారు. పోలీసులు జోక్యం చేసుకోగానే ఠాకూర్లు, ఇంకొంత మంది అగ్ర కులస్థులు దళితులపై దారుణంగా దాడి చేశారు.

ఈ దాడిలో 65 ఇళ్ళు, వ్యవసాయ పనిముట్లు, పశుగ్రాసం, మోటార్ సైకిళ్ళు బూడిదయిపోయాయి. ఎంతోమంది జనాలను ముఖ్యంగా ముసలీ ముతకా, పిల్లలూ, మహిళలను చావబాదారు. 14,15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ

హింసాత్మక దాడిలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు.

అంతకు ముందు కొద్ది రోజుల క్రితమే బులాంద్ షహర్ జిల్లాలోని సోహి అనే గ్రామానికి చెందిన 54 ఏళ్ళ గులామ్ అహమ్మద్‌ను ఒక హిందూ మహిళ ముస్లిమ్ పురుషునితో పారిపోయిందన్న నెపం చూపుతూ హిందూ యువవాహిని కార్యకర్తలు కొట్టిచంపారు. ఈ శక్తులు ఇలాగే గనక కొనసాగితే ఉత్తర ప్రదేశ్ కులమత విద్వేషాల కుంపటిగా తయారవుతుంది. ఉనా సంఘటన మరో విషాదం. ఇక్కడ నలుగురు దళితులు చనిపోయిన పశువుల చర్మాన్ని వలవడం అనే సాంప్రదాయంగా తమ పై రుద్దబడిన పనిని చేస్తుండగా గోరక్షులు వారిపై దాడి చేశారు. ఈ విషయం సామాజిక మాధ్యమంలో తీవ్ర నిరసనను ఎదుర్కొంది. ఈ యువకులు పోలీసుల లాఠీలతోనే దళితులను చావబాదడం చూస్తే ఇందులో పోలీసుల మద్దతు పరోక్షంగా ఉందన్నది స్పష్టమవుతున్నది.

ప్రతి యేడూ హోం మంత్రిత్వ శాఖ దేశంలోని నేరాలకు సంబంధించిన వివరాలతో రిపోర్టును తయారు చేస్తుంది. ప్రచార మాధ్యమాలలో దళితులపై దాడులు పెరగుతున్నట్టు వస్తుంటే ఈ రిపోర్టులో యేటికేడూ ఎస్‌సి, ఎస్‌టిలపై నమోదయిన కేసులు తగ్గుతున్నట్టు చూపడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. 2013లో ఎస్‌సి, ఎస్‌టిలపై దుర్మార్గాల చట్టం ప్రకారం నమోదయిన కేసులు 13975 కాగా 2015 నాటికి వీటి సంఖ్య 6005కి పడిపోయింది. అంటే 133% తరుగుదల నమోదయ్యింది. కాని గణాంకాలు ఇతర నేరాలతోపాటు దళితులపై దాడులు పెరుగుతున్నాయని చెపుతున్నాయి. బహుశ పోలీసులకు పిఓఏ క్రింద కేసులు నమోదు చేయవద్దని ఉత్తర్వులు అంది ఉండవచ్చు. లేక పోతే వాస్తవంలో దళితులపై దాడులు పెరుగుతుండగా 2014 నుండి దాడులు తగ్గుతున్నది నమోదు కావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

**దళితులకు ఉపాధి శూన్యం :** సాధారణంగా దళితులకు ఏరకమయిన ఆస్తులూ ఉండవు. ప్రభుత్వరంగంలో ఉపాధి వారి పురోగతికి ఎంతగానో తోడ్పడింది. ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాలు అవలంభించడంతో ప్రైవేటు రంగం పురోగమించి ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు క్షీణించాయి. దళితులకు ఆర్థిక స్థోమత కల్పిస్తానని ఊదరగొట్టిన బిజెపి ప్రభుత్వం దగ్గర పేరుకుపోయిన ఖాళీలను నింపేందుకు ఏ విధమయిన విధాన రూపకల్పనా లేదు. 2008లో మాత్రమే అప్పటివరకు పేరుకుపోయిన ఎక్కువ మంది దళితులకు చెందవలసిన ఉద్యోగాలు భర్తీ చేయబడ్డాయి.

**2011-2015 మధ్యకాలంలో దళితులపై జరిగిన నేర సంఘటనలు**

| సం॥ | 2011 | 2012 | 2013 | 2014 | 2015 | % 2013-15 |
|---|---|---|---|---|---|---|
| | | | | | | వరకు మార్పు |
| హత్య | 673 | 651 | 676 | 794 | 813 | 20.27 |
| రేప్ | 1557 | 1576 | 2073 | 2388 | 2541 | 22.58 |
| SC/ST POA చట్టం | 11342 | 12576 | 13975 | 8887 | 6005 | 132.72 |
| ఇతర నేరాలు | 14958 | 14164 | 16797 | 27684 | 27684 | 64.8 |

**మూలం MHA వార్షిక రిపోర్టు 2016-17**

**దళితులకు బడ్జెట్ కేటాయింపులు నిరాకరించిన బిజెపి :**

స్పెషల్ కాంపొనెంట్ ప్లాన్ (ఎస్‌సిపి) క్రింద ఎస్‌సి, ఎస్‌టి ప్రజలకు దామాషా ప్రాతిపదికన ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేయాల్సిన నిబంధన ఉంది. ఈ కేటాయింపులు ప్రణాళికా సంఘం పర్యవేక్షణలో జరుగుతాయి. ప్రణాళికా బద్ధ ఆర్థిక వ్యవస్థ రద్దవడం దళితులకు శాపంగా మారింది. నేషనల్ కాంపెయిన్ ఫర్ దళిత్ హ్యూమన్ రైట్స్ (NCDHR) ప్రకారం జనాభా ప్రాతిపదికన ఎస్‌సిలను రూ. 91,386 కోట్లు, ఎస్‌టిలకు రూ. 47,276 కోట్లు కేటాయించవలసి ఉంది. కాని ఈ యేడు ఎస్‌సిలకు రూ. 52,393 కోట్లు అంటే 55% ఎస్‌టిలకు రూ. 31,920 కోట్లు అంటే 66% కేటాయించడం జరిగింది. నిజానికి ఇవి కూడా పూర్తిగా ఎస్‌సి, ఎస్‌టిలకే కేటాయించిన మొత్తాలు కావు. ఇందులో ఇతర రంగాల కేటాయింపులూ కలిసి ఉన్నాయి. ఎస్‌సి, ఎస్‌టి పార్లమెంట్ సభ్యులు ఎస్‌సి, ఎస్‌టి నిధుల కేటాయింపులలో పెరుగుదల నామమాత్రమేన అని, ఇందులోనూ అధికశాతం పరిపాలనా ఖర్చులయిన జీతాలు, పెన్షన్‌లకే పోతుంది అనీ దళితుల స్వావలంబన లక్ష్యంగా చేసుకున్న పథకాలను లక్ష్యం చేసుకుని సరిగ్గా కేటాయించడం జరగలేదని ప్రధానికి లేఖ వ్రాశారు.

దళితులకు ప్రత్యక్షంగా చేరే ప్రయోజనం స్కాలర్‌షిప్‌లు. రూ. 11267.61 కోట్ల స్కాలర్‌షిప్‌ల మొత్తం, ముందటి సంవత్సరాలలో ఇవ్వవలసినది బకాయిగా మిగిలి ఉంది. ఎస్‌సిలకు చదువు సామాజికంగా ముందడుగు వేయడానికి ఎంతో అవసరం. అందువలన అందులో బకాయిలు పెట్టడం అంటే దళిత విద్యార్థులు స్కూళ్ళలో, కాలేజీలలోనూ చదువులను కొనసాగించలేని స్థితిని ఉద్దేశపూర్వకంగా కల్పించడమే.

**బిజెపి జిమ్మిక్కులకు ప్రత్యామ్నాయం – నిజమైన దళితుల సాధికారికత:**

ఇందుకు విరుద్ధంగా కేరళ, త్రిపుర రాష్ట్రాలలోని సిపిఐ(ఎం) ప్రభుత్వం బడ్జెట్ ప్రణాళికలో కేటాయింపులను కొనసాగించింది. తన బడ్జెట్ ఉపన్యాసంలో థామస్ ఐసాక్ రూ. 2600 కోట్లు ఎస్.సి.పి క్రింద, 751 కోట్లు (టిఎస్‌పి) ట్రైబల్, స్పెషల్ ప్లాన్‌కి కేటాయించారు. మొత్తం జనాభాలో ఎస్‌సిల జనాభా 9.10% అయినందువలన వారికి మొత్తం వ్యయంలో 9.81%, గిరిజనుల 1.45% ఉన్నందున వారికి 2.45% కేటాయించారు. అంటే దళితులకు రూ. 188 కోట్లు, గిరిజనులకు రూ. 366 కోట్లు అదనంగా కేటాయించారు. ఈ కేటాయింపులు మరే ఇతర రాష్ట్రం కన్నా ఎక్కువే.”

వామపక్షాల పరిపాలనలో ఉన్న రాష్ట్రాలలో ప్రత్యామ్నాయ అభివృద్ధి ఎలా జరుగుతున్నదో ఇది తెలియజేస్తుంది. బిజెపి చెప్పే బూటకపు ‘మంచిరోజులకు’ ఇదే సమాధానం.

★

# మూడేళ్ళ మోదీ పాలన
# అస్తవ్యస్థ విదేశాంగ విధానం

గత మూడు సంవత్సరాలలో భారతదేశం స్వతంత్ర దక్షిణ ఆసియా గొంతును వినిపించే దేశంగా ముఖ్యమయిన స్థానాన్ని వదులుకుని అమెరికా జూనియర్ భాగస్వామిగా మారింది. దేశం చుట్టూ ఉన్న పాకిస్థాన్, చైనా, నేపాల్‌తో సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఏమాత్రం ఆలోచనలు లేకుండా, సంసిద్ధత లేకుండా కేకలతో, వదరులతో గడిచింది. దేశంలో ఆఫ్రికా విద్యార్థులపై జాత్యహంకారుల దాడులు, ఆఫ్రికాలో భారతీయుల పట్ల తిప్పికొట్టేందుకు దారితీసాయి. ఇవి దీర్ఘకాలంలో దౌత్య వ్యవహారాలలో పరోక్షంగా ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

మోదీ విదేశాంగ విధానం మోదీదే. విధానాలన్నీ మోదీ చుట్టూనే. తరచుగా వెళ్ళే విదేశాలలో ప్రచార మాధ్యమాలన్నీ మోదీ చుట్టే అల్లుకుని ఉంటాయి. విదేశీ వ్యవహార మంత్రిత్వ శాఖ, అనుభవజ్ఞులైన భారత దౌత్యవేత్తలు పక్కకు నెట్టివేయబడ్డారు. అందువలన ఈ ప్రయాణాలలో సందర్శనలలో గంభీరమైన దౌత్య వ్యవహారాలకు చోటు లేకుండా పోయింది. వాగాడంబరాలు, గాలి కబుర్లు అసలు విషయాలను కమ్మేసాయి. ఇందుకు తోడూ భారతదేశ విదేశాంగ విధానాన్ని భారతదేశ రక్షణకు కుదించేయడం జరిగింది. అందువలన ప్రపంచదేశాలు, భారతదేశాన్ని అంతకంటే ఎన్నో రెట్లు చిన్నదయిన పొరుగునున్న పాకిస్తాన్‌తో సమానంగా చూడడం మొదలు పెట్టాయి.

**భారత్ అమెరికా రక్షణ ఒప్పందాలు :**

2015లో భారతదేశం అమెరికాతో 10 ఏళ్ళ రక్షణ ఒప్పందానికి సంతకం చేసింది. ఇప్పుడు దానికి మరో మూడు ఒప్పందాలు చేరాయి. – సైనిక మద్దతు

ఒప్పందం, రవాణా సదుపాయాలు సమాచార రక్షణ (Memorandum of understanding) - (CISMOA) బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కోఆపరేషన్ అగ్రిమెంట్ (BECA). ఇందులో రవాణా సదుపాయాలు, సమాచార రక్షణ అన్నది పైపూతే. ఈ మూడింటిని, రక్షణ ఒప్పందంతో కలిపితే భారతదేశం అమెరికా సైన్యానికి తన విమానాశ్రయాలు, (హార్బర్లు) నౌకాశ్రయాలు, అప్పజెప్పవలసి ఉంటుంది. భారతదేశం అమెరికా పరికరాలను 'వాడుకో'వలసి వుంటుంది. భారత దేశం అమెరికా సైన్యంతో 'కలిసి పని' చేసి వారి ఆయుధాలను పరికరాలను వాడవలసి వుంటుంది. భారతదేశంలో అమెరికా దుందుడుకు చేష్టలకు స్థానం కల్పించడమే కాక ఒకే మిలిటరీ కమాండ్ క్రింద, ఒకరి ఆదేశాల పరిధిలోనే పనిచేయడం అంటే భారతదేశం, అమెరికా సైనికులకు అనువైన అమెరికా ఆయుధాలను, పరికరాలను కొనవలసి ఉంటుంది. ఇది సాధారణంగా జరిగే సైనిక ఒప్పందాలకు భిన్నమయినది. ఇది భారతదేశ కీలక ప్రయోజనాలను చరిత్రలో మున్నెన్నడూ జరగని రీతిలో అమ్మివేయడమే.

క్రిందటేడు అమెరికా, జపాన్, భారతదేశం కలిసి జపాన్‌లోని ఒకినవ దగ్గర ఫిలిప్పైన్స్ తీరప్రాంతంలో జరిపిన మలబార్ నావికా యుద్ధ విన్యాసాలు చైనా, వియత్నాం, ఫిలిప్పైన్‌లకు మధ్యనున్న వివాదాలలో అమెరికా తలదూర్చడంలో భాగమే. భారతదేశం దక్షిణ చైనా సముద్రంలో అమెరికా అడుగుజాడలలో నడుస్తున్నది.

అనేక పర్యాయాలు అమెరికా భారతదేశం నావికా దళాలు కలిసి పనిచేయడాన్ని నొక్కి చెప్పాయి. అమెరికా నావికా దళానికి, భారతదేశ నావికా దళానికి బోయింగ్-8 పొసెడొన్ మిలిటరీ విమానాలు ఉండడంపై వైస్ అడ్మిరల్ జోసెఫ్‌పి అకోయిన్ మాట్లాడుతూ "ఈ రెండు విమానాలు కలిసి సబ్‌మెరైన్లను వేటాడడం నేను ఇష్టపడతా"నన్నారు. ఇందుకోసం భారతదేశం ఒక బిలియన్ డాలర్లతో నాలుగు P81 విమానాలను బోయింగ్ నుండి కొనుగోలు చేసింది.

ఈ ఒప్పందాలకు తోడు మోదీ ప్రభుత్వం 100% విదేశీ పెట్టుబడులను రక్షణలో అనుమతించింది. అమెరికా కంపెనీలు 100% పెట్టుబడి సొంత సబ్సిడీలలో పెట్టగలదు. టెక్నాలజీని భారతదేశానికి బదిలీ చేయకుండానే భారత్ - అమెరికా ఆయుధాలను భారతదేశం నుండే తయారయినట్టు చూపించి అమ్మేయగలదు. కానీ టెక్నాలజీ బదిలీ కానందువలన భారతదేశ సైనికులు వాటిని అమెరికా సహాయం లేకుండా వాడలేరు.

**పొరుగు వారితో పొసగని వైనం**

మోదీ ఆధ్వర్యంలో పాకిస్థాన్, చైనా, నేపాల్ లాంటి పొరుగు దేశాలతో సంబంధాలు ఎన్నడూ లేనంత అధమ స్థాయికి దిగజారాయి. ఇందుకు కారణం మోదీ, బిజెపిలు విదేశాంగ విధానం అంటే వాగాడంబరమని భ్రమించడమే. అతి చిన్న దేశాలు కూడా సైనిక ఆర్థిక బెదిరింపులకు లొంగడం లేదు. విదేశీ మంత్రిత్వ శాఖను దాటి వెళ్ళడం అంటే చర్చలకు ఏమాత్రం సన్నద్ధం కాకపోవడమే. హడావుడిగా ఏర్పాటు చేసే విదేశీ నాయకులతో భేటీలలో ప్రచారానిదే పెద్దపీట. దీని వలన ఈ ప్రాంతంలోని భారతదేశ దీర్ఘకాల సంబంధాలు దెబ్బతింటాయి.

పాకిస్థాన్ విషయానికి వస్తే, మోదీ తన ప్రమాణస్వీకారానికి సార్క్ దేశాధి నేతలను, పాకిస్థాన్ ప్రధాని నవాబ్ షరీఫ్‌ను పిలిచి మంచి పని చేశారు. కాని ఆ తరువాత పాకిస్థాన్ దౌత్యవేత్త హరియత్ నాయకులతో కలిసి మాట్లాడారన్న నెపంతో ఆ తరువాతి రెండు దేశాల విదేశాంగ కార్యదర్శుల సమావేశాలు రద్దు చేశారు. ఆ తరువాత మోదీ అర్థాంతరంగా లాహోర్ వెళ్ళారు, వెనువెంటనే పఠాన్‌కోట్‌ను తీవ్రవాదులు ముట్టడి చేశారు. ఆ సంఘటనను విచారణ జరిపే సందర్భంలో భంగపాట్లు ఎదురయ్యాయి. భారత సైనికులు సరిహద్దు వెంట జరిపిన కాల్పులను మోదీ అధికార ప్రతినిధి ఇదివరకెప్పుడు జరగనట్టు 'సర్జికల్ దాడులుగా' అభివర్ణించారు. ఒక అతిజాతీయవాద వాతావరణాన్ని ప్రోత్సహించారు. భారత్ – పాకిస్థాన్‌ల మధ్య శాంతిని కోరుకోవడం అంటే దేశద్రోహంగా తయారయింది.

ఇంతకు ముందు చర్చలు మొదలయ్యేవి, ఆగిపోయేవి. చర్చలు చర్చలు విఫలమవడం జరుగుతుండేది. గత ఏడాది నుండి రెండు అణ్వాయుధాలు గల దేశాలు నువ్వెంతంటే నువ్వెంత అన్న రీతిగా ఎదురుబొదురుగా నున్నాయి. ఈ వైరం ఏరోజైనా చేయి దాటిపోవచ్చు. గట్టిగా నిలబడితే పాకిస్థాన్ చర్చలకు దిగివస్తుందన్న మోదీ ఆలోచన తప్పని తేలిపోయింది. మోదీ నాయకత్వంలో తీవ్రవాదుల హింస, సరిహద్దులు దాటుతున్నవారి యెడల హింస, రెండు దేశాల సాధారణ పౌరుల ప్రాణాలు పోవడం, సైనికుల మరణాలు ఎక్కువయ్యాయి.

భారత చైనా సంబంధాలదీ ఇదే తీరు. అహమ్మదాబాద్‌లో మొదలైన వెచ్చని స్నేహం లడక్‌లో ఆవిరయిపోయింది. అమెరికాతో కలిసి భారత్ దక్షిణ చైనా సముద్రంపై విడుదల చేసిన ప్రకటన సంబంధాలను మరింత దిగజార్చింది. భారత దేశం అమెరికా, జపాన్‌లతో కలిసి జరిపిన నావిక విన్యాసాలు, ఎన్ఎస్‌జితో

భారత్ సభ్యత్వాన్ని చైనా వ్యతిరేకించడం, మసూద్ అజహర్ ఒక తీవ్రవాది అన్న యునైటెడ్ నేషన్స్ ప్రకటనను చైనా అడ్డుకోవటం (మసూద్ అజహర్ నిస్సందేహంగా తీవ్రవాదే), ఇంటర్ పోల్ (అంతర్జాతీయ పోలీసు) తీవ్రవాదిగా గుర్తించిన ఉయిగుర్ కార్యకర్తను ఇందుకు ప్రతీకారంగా భారత్ ఆహ్వానించడం, అరుణాచల్ ప్రదేశ్‌కు దలయిలామాను అనుమతించడం, రెండు దేశాలు సంబంధాలను పూర్తిగా దిగజార్చింది.

భారతదేశం 'వన్ బెల్ట్ వన్ రోడ్డు' ప్రణాళికలో చేరేందుకు వ్యతిరేకించింది. ఇందులో 100 దేశాలు సంతకాలు చేసాయి. ఇన్ని దేశాలు కలిసి యురేషియా – ఆఫ్రికాకు ఒకే రోడ్డు రైలు సముద్ర ఆధారిత వ్యాపార వలయాన్ని ఏర్పరచుకుంటున్న సందర్భంలో భారతదేశం ఒంటరిపాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీనినుండి వేరుపడడం వలన చైనా, పాకిస్థాన్ ఆర్థిక మార్గం నుండి భారతదేశం విడిపోయి మిగిలిన యురేషియాలో వృద్ధి చెందుతున్న వ్యాపార సంబంధాలను కోల్పోతుంది. భారతదేశం ఇందులో భాగస్వామ్యం కానందుకు మనదేశానికి మద్దతునిచ్చిన అమెరికా కూడా బీజింగ్ సదస్సుకు పదిమంది ప్రతినిధులను పంపింది. భారతదేశం అమెరికా కనుసన్నలలో తిరగడం వలన ఆసియాలోనే మన దేశాన్ని వింతగా చూసే పరిస్థితి ఏర్పడింది. భారతదేశం నేపాల్‌లో సంబంధాలను కొనసాగించడం మరింత అస్తవ్యస్థంగా ఉంది. నేపాల్‌లో ప్రజలు భారతదేశం మధెసీయులకు మద్దతునిస్తున్నదని అందువలననే వారి సమ్మెకు మద్దతుగా భారతదేశం నుండి నేపాల్‌కు వెళ్ళే వస్తువులను ఆపేసిందని భావిస్తున్నారు. మనదేశం పట్ల ఉన్న వారి అభిమానాన్ని పోగొట్టుకున్నాం. ఆదిత్యనాథ్ లాంటి వారు భ్రష్టుపట్టిన రాజరికాన్ని వారు హిందువులు కాబట్టి పునరుద్ధరిస్తామని మాట ఇచ్చినంత మాత్రాన పరిస్థితిలో మార్పు ఏమీలేదు.

**అమెరికా అణు ఒప్పందం**

ఒకే ఒక్క మెచ్చుకోవలసిన అంశం ఏమిటంటే అమెరికాతో భారతదేశం చేసుకున్న అణుఒప్పందం రద్దయింది. దీనిని వామపక్షాలు ఎప్పటినుండో వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. అయితే ఇందుకు కూడా మోదీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పాల్సిన పనిలేదు. ఈ నిర్మాణాన్ని చేపట్టవలసిన వెస్టింగ్‌టన్ హౌస్ దివాలా తీసింది. ఇక ఆ దివాలా తీసిన సంస్థ ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వాడలో ఆరు అణువిద్యుత్ కేంద్రాలు పెట్టాలనుకోవడం తెలివి తక్కువతనం. వాజపాయి ప్రభుత్వం ఎన్‌రాన్‌కు ఇటువంటి హామీనే ఇచ్చి ఇరుక్కున్నట్లు మోదీ ప్రభుత్వం పంపకందారుల నష్టాలకు పరిహారం ఇచ్చేందుకు చేసిన గ్యారంటీ మనలను వెన్నాడదని ఆశిద్దాం.

ఇజ్రాయిల్ జాతీయ స్వతంత్ర పోరాటాలకు మద్దతునిచ్చే విధానానికి భారత ప్రభుత్వం మంగళం పాడింది. ఇజ్రాయిల్ పాలస్తీనా దురాక్రమణను నిరసించడానికి సిద్ధంగా లేదు. ప్రపంచంలో ఇప్పటికీ పరాధీనంగా ఉన్న ఒకే ఒక్క దేశం పాలస్తీనా. ఇప్పుడు మనం ఇజ్రాయిల్ నుండి ఆ దేశం తనకోసం సమకూర్చుకుంటున్న ఆయుధాలకన్నా ఎక్కువ కొంటున్నాం. గత 15 సంవత్సరాలలో భారతదేశం ఇజ్రాయిల్‌నుండి 1000 కోట్లు డాలర్ల ఆయుధాలను కొనింది. ఈ కొనుగోళ్ళ వ్యవహారాలలో అవినీతి జరుగుతున్నదని పదేపదే రుజువయినా వ్యవహారంలో మార్పులేదు.

ఈ లావాదేవీలన్నీ మోదీగారు జులై సందర్శన సందర్భంగా ఇజ్రాయిల్‌ను ప్రసన్నం చేయడానికి అయివుంటుంది. మోదీ విదేశ సందర్శనలకు వెళ్ళినప్పుడల్లా ఖరీదయిన ఆయుధాల కొనుగోళ్ళు చేయడం ఒక పద్ధతిగా మారింది. ఫ్రాన్స్‌లో 850 కోట్ల డాలర్ల రాఫెల్ ఒప్పందం విషయంలో కూడా మోదీ కొనుగోలు నిబంధనలు తుంగలో తొక్కి ఒప్పందం చేసుకొని ఘనమైన స్వాగతం పొందారు.

**జాతి వివక్షత**

మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం ఢిల్లీలో ఆఫ్రికా విద్యార్థుల యెడల వ్యవహరించిన నిర్లక్ష్య ధోరణిలో తేటతెల్లమవుతున్నది. ఫలితంగా 44 ఆఫ్రికా దేశాల రాయబారులు ఢిల్లీలో 'ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల'ను కలిసి ఆఫ్రికా విద్యార్థుల పట్ల విచ్చలవిడిగా సాగుతున్న హింసాత్మక ఘటనలను ఫిర్యాదు చేయడం జరిగింది.

ఒక స్వతంత్ర విదేశాంగ విధానం అనుసరించకపోవడం వలన మోదీ ప్రభుత్వం భారతదేశానికి అంతర్జాతీయ సమాజంలో గుర్తింపు గౌరవం లేకుండా చేసింది. మొట్ట మొదటిసారిగా భారతదేశం అలీన సదస్సులో పాల్గొనలేదు. భారతదేశం అమెరికా తొత్తుగా మారిపోయింది. వీరి 'అతిదేశభక్తి' సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా గొంతెత్తడంలో లేదు. జాతీయోద్యమ కాలంలో గుర్తింపు పొందిన ఈ విధానం అటకెక్కి వాగాడంబరానికి డంబాలకు పరిమితమయ్యింది. ఈ ప్రభుత్వ విదేశీ విధాన 'సాఫల్యం' కేవలం టెలివిజన్ స్టూడియోలలో రాజకీయ ప్రత్యర్థులవరకు మాత్రమే పరిమితమయ్యింది.

★

# మూడేళ్ళ మోదీ పాలన
# ఉపాధి లేక అల్లల్లాడుతున్న ప్రజలు

ఈ మధ్యే వెలువడ్డ ప్రభుత్వ రిపోర్టు ప్రకారం గత ఏడాది కాలంలో వ్యవసాయేతర రంగంలో 2.3 లక్షల మందికి ఉపాధి కల్పించబడింది. ఈ రంగాలు ఉత్పత్తి, నిర్మాణరంగం, వాణిజ్యం, రవాణా, హెూటళ్ళు, రెస్టారెంట్లు, ఐటి/బిపిఓ, విద్య, ఆరోగ్యం. వీటన్నింటిలో దాదాపు రెండు కోట్లమంది కార్మికులు పనిచేస్తారు. అంటే ఈ యేడు అదనంగా ఈ రంగాలలో ఉద్యోగం దొరికింది కేవలం 1.1 శాతానికి మాత్రమే.

**గుర్తు తెచ్చుకోండి :** మోదీ స్వయంగానూ, అతని ప్రభుత్వం కూడా భారత దేశ ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించడం ఈ ప్రభుత్వ అతి పెద్ద కర్తవ్యంగా ఉంటుందని వాగ్దానం చేసాయి. వారు అంత్యంత డాంబికంగా ప్రచారం చేసిన 'మేక్ ఇన్ ఇండియా' (భారతదేశంలో తయారుచేయడం) 'స్కిల్ ఇండియా', (భారతదేశంలో నైపుణ్యాన్ని సంతరించుకోవడం) 'స్టార్ట్ అప్స్ ఇండియా' (భారతదేశంలో పరిశ్రమలు మొదలు పెట్టడం,) భారతదేశాన్ని వెన్నాడుతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించి దేశ ఆర్థిక వ్యవస్థ సుభిక్షం చేయాలని. నిజానికి మోదీ విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడాన్ని సమర్థించుకున్నదే వారి పెట్టుబడులు ఉద్యోగాలు తెచ్చిపెడతాయని.

మూడేళ్ళ తరువాత ఈ వాగ్దానాలన్నీ గాలిలో కలిసిపోయాయి. ఇప్పుడు మోదీగాని, జెట్లీ గాని ఉపాధి కల్పన గురించి మాట్లాడడం లేదు. పథకాలన్నీ అటకెక్కాయి. ఇప్పుడిక ఎన్నికలలో గెలిచేందుకు, ప్రజలను మభ్యపెట్టేందుకు, విఐపి కార్లపై ఉన్న బుగ్గలైట్లు తీసేయడం, గుళ్ళు గోపురాలలో పూజలు చేయడం లాంటి కొత్త గిమ్మిక్కులను అవలంభిస్తున్నాయి. కాని ప్రజలందరూ ఉపాధి హామీ సంగతేమయ్యిందా అని ఆశ్చర్యపోతున్నారు.

ఉపాధి హామీ పథకం (MGNREGS) గణాంకాల ప్రకారం నిరుద్యోగం నిరంతరంగా అప్రతిహతంగా పెరుగుతున్నది. మోదీ ప్రధాన మంత్రయిన మొదటి యేడు 4.65 కోట్ల కుటుంబాలు ఈ పథకం కింద పనిని డిమాండ్ చేసాయి. ఆ తరువాత సం॥ 2015-16లో ఈ సంఖ్య 15% పెరిగి 5.35 కోట్లు చేరుకుంది. 2016-17 ఇది మరో 6% పెరిగి 5.69 కోట్లకు చేరిందని పరిశోధకుల అంచనా.

ఒకవైపు ఎంతో తక్కువ వేతనాలున్న ఉపాధి హామీ పథకం కోసం డిమాండు చేసేవారి సంఖ్య పెరుగుతుండగా మరోవైపు 10-11% శాతం దరఖాస్తుదారులకు కూడా ఉపాధి అందడం లేదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే క్రితం సంవత్సరం దాదాపు ఉపాధి ఈ పథకం కింద కోరుకుంటున్న 58 లక్షల మందికి మొండి చెయ్యి చూపారు.

ఈ సంవత్సరం 2017-18లో 35 రోజులే గడిచాయి. కాని ఇప్పటికే ఉపాధి కోరుకుంటున్న వారి సంఖ్య 1.38కోట్లు దాటింది. క్రితం సంవత్సరం వర్షాలు అంతకు ముందటేడు కన్నా బాగున్న స్థితిలోనే ఇలా ఉంది.

ఈ మధ్యే వెలువడిన గణాంకాల ప్రకారం ఉద్యోగాల పెరుగుదల తక్కువ ఉండడమే కాదు కల్పించినవి కూడా అసమానతలతో నిండి ఉన్నాయి. 2.1 లక్షల ఉద్యోగాలు కల్పించబడిన వాటిలో సగానికి సగం ఉద్యోగాలు రెండే రెండు రంగాలలో కల్పించబడ్డాయి. విద్య, వైద్యం. ఈ రెండు రంగాలలో 1.1 లక్షల కొత్త ఉద్యోగాలు చేరాయి.

ఉత్పత్తి రంగంలో ఉపాధి కల్పన 1% దాటలేదు. అదీ 2016లో చివరి త్రైమాసికంలో అదాటున పెరిగిన వృద్ధి వలననే. అయితే ఈ త్రైమాసికంలోనే దురదృష్టకరమైన నోట్ల రద్దు భారతదేశంపై రుద్దబడినందువలన, ప్రజలు ఉన్న ఉపాధులే కోల్పోయినందువలన ఈ గణాంకాలపై అపనమ్మకం ఏర్పడుతున్నది.

వ్యవసాయేతర రంగానికి వెన్నెముక ఉత్పత్తి రంగం. ఇందులో సగంమందికి ఎనిమిది విభాగాలే ఉపాధి కల్పిస్తున్నాయి. ఇంతపెద్ద విభాగంలో ఒక్క శాతం అభివృద్ధి అన్నది లెక్కలేదు. నిజానికి మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న రంగం ఇది. తన 'మేక్ ఇన్ ఇండియా', 'స్కిల్ ఇండియా' పథకాల ద్వారా, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా. ఇవన్నీ పేకమేడల్లా కూలిపోయాయని అనుకోవలసి వస్తుంది.

భారతదేశ పెట్టుబడిదారులు పెట్టుబడులను ఉత్పత్తిరంగంలో పెట్టకపోవడం, ఇందుకు తోడు విదేశీ పెట్టుబడిదారులు కూడా భారతదేశ ఉత్పత్తి రంగంలో

పెట్టుబడి పెట్టక పోవడం అంటే కొత్త ఉద్యోగాలు కల్పించకపోవడమే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న ఉద్యోగాలు ఊడిపోవడమే. ఇది ఉద్యోగ కల్పన మరింత దిగజారే పరిస్థితికి దారితీస్తుంది. కొత్తగా కల్పించడం కాదు కదా ఈ మధ్య పారిశ్రామిక రంగ విశ్లేషకులు ఇదివరకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించిన ఐటి, టెలికం, బ్యాంకింగ్ ఇతర ఆర్థిక సేవా రంగం, ఇకపై ఉద్యోగులను తొలగించబోతున్నారని చెప్పారు. ఈ మూడు రంగాలనుండి వచ్చే 12–18 నెలలో పదిలక్షల మంది తొలగించబడతారని ఒక అంచనా. ఇందుకు కారణం మాంద్యం, టెలికాం రంగంలో దిగ్గజాల విలీనాలు, యాంత్రీకరణ. మోదీ గారి ప్రశంసలందుకున్న ఎంతో మంది చిన్న పారిశ్రామిక వేత్తలు (స్టార్ట్అప్స్) తమ పరిశ్రమలను మూయనన్నా మూసారు, మరిన్ని మినహాయింపులనయినా కోరుతున్నారు.

**ఉద్యోగాలెక్కడ? (లక్షలలో)**

| | **మొత్తం ఉద్యోగాలలో మారినవి** | **2016 జనవరి 2017 జనవరి మధ్య కాలంలో** | **2016లో %** |
|---|---|---|---|
| ఉత్పత్తి | 101.2 | 1.0 | 0.9 |
| నిర్మాణం | 3.7 | -0.3 | -6.8 |
| వ్యాపారం | 14.5 | 0.3 | 1.8 |
| రవాణా | 5.8 | 0.2 | 3.1 |
| బస, రెస్టారెంట్లు | 7.7 | -0.1 | -0.9 |
| ఐటి/బిపిఒ | 10.4 | 0.2 | 2.1 |
| విద్య | 50.0 | 0.7 | 1.3 |
| వైద్యం | 12.1 | 0.4 | 2.9 |
| మొత్తం | 205.2 | 2.3 | 1.1 |

మూలం : త్రైమాసిక ఉపాధి సర్వే, లేబర్ బ్యూరో మార్చి 2017.

మోదీని భజించడంలో అలుపెరగని విదేశీ విశ్లేషకులు కూడా ఉపాధి పెరుగని వృద్ధిని చూసి ఆందోళన చెందుతున్నారు. భారతదేశంలో 15–29 ఏళ్ళ మధ్య వయస్కులలో 30% మందికి ఉపాధి లేదు, చదువు లేదు, నైపుణ్యంలో శిక్షణ లేదు. ఈ మధ్య కాలంలో ఆర్గనైజేషన్ ఆఫ్ ఇకనామిక్ కోపరేషన్ (OECD), అభివృద్ధి చెందిన దేశాలలోని సంస్థ అంచనా ఇది. ఇది OECD సరాసరి అయిన

14.6%నికి రెట్టింపు, 11.2% అయిన చైనాకు మూడు రెట్లు.

భారతదేశ అభివృద్ధి గురించి తన భుజం తానే తట్టుకుంటున్న భారతదేశ అభివృద్ధి ఆగిపోయింది. అందుకే ఉద్యోగావకాశాలలో కూడా వృద్ధి లేదు.

ప్రతి మాసం ప్రభుత్వం విడుదల చేసే పారిశ్రామిక ఉత్పత్తి సూచిక ఈ భయంకర పరిస్థితినే ధృవీకరిస్తున్నది. 2015-2017 మధ్య కాలంలో ఒక్క శాతం అభివృద్ధిని సూచిస్తున్నదంటే వాస్తవ పరిస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు.

రిజర్వు బ్యాంకు విడుదల చేసిన గణాంకాల ప్రకారం కూడా ఈ కాలంలో పరపతి ఈ రంగానికి 0.3% పెరిగింది. ఇందులోనే చిన్న తరహా, మధ్య తరహా, మైక్రో, పెద్ద పరిశ్రమలు, అంటే 40%గా ఉండే ఆహారేతర పరపతి అంతా ఇమిడి ఉంది. పారిశ్రామిక పరపతి ఇంత చిన్న మొత్తంలో పెరగడం అంటేనే ఉత్పాదకరంగంలో అభివృద్ధి లేనట్టు. అంటే ఉపాధి అవకాశాలు పెరగనట్టు.

జాతీయ ఆదాయ వ్యయ రెండవ ముందస్తు అంచనా కూడా పారిశ్రామిక రంగం దిగనారిల్లుతున్నదన్న విషయాన్ని ధృవీకరించింది. స్థిర పెట్టుబడిలో మదుపుల పెరుగుదల అంటే స్థూల స్థిర పెట్టుబడి తయారీ కారకాలు 2015-16, 2016-17 మధ్య 6.1 % నుండి 0.6%నికి తగ్గింది. అంటే కార్పొరేట్ రంగం నూతన పరిశ్రమలో పెట్టుబడులు పెట్టడం లేదు.




స్థూల విలువ చేరిక (జివిఎ) మూల ధరలు - నిజమైన ఉత్పత్తి కొలమానం - 2015-16లో 7.8% ఉండగా 2016-17లో 6.7%నికి దిగజారింది. ఆర్థిక రంగం ఆరోగ్యకరంగా లేదని ఇది కూడా ధృవీకరిస్తున్నది. అందువలననే ఉపాధిలో పెరుగుదల లేదు. ప్రజల ఉపాధి కరువయి అల్లల్లాడుతున్నారని నిర్ధారించ వలసి వస్తున్నది.

★

# మూడేళ్ళ మోదీ పాలన
# కార్పొరేట్ ఎగవేతదారులకు వరాల జల్లు

భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థ 2008 ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకునేంత దృఢంగా ఉండింది. ఇప్పుడిది సంక్షోభంలో పడింది. బ్యాంకులు, ముఖ్యంగా ప్రభుత్వ బ్యాంకులలో పారు బకాయిలు పేరుకుపోయాయి. ప్రభుత్వ రంగంలో దాని ఉనికే ప్రశ్నార్థకం అయ్యింది.

బిజెపి కేంద్రంలో పాలిస్తున్న మూడేళ్ళ కాలంలో బ్యాంకింగ్ వ్యవస్థలో పారు బకాయిలు మూడు రెట్లు పెరిగాయి. 2.3 లక్షల కోట్లనుండి 6.8 లక్షల కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం బ్యాంకులలో పారు బకాయిలు మొత్తం రుణాలలో 11%నికి చేరాయి.

భారతదేశంలోని పెద్ద కార్పొరేట్ హౌస్‌లు రుణాలు చెల్లించకపోవడమే పారు బకాయిలు ఇంతగా పెరగడానికి మూల కారణం. పార్లమెంటరీ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ కె.వి. థామస్, బ్యాంకులలోని పారు బకాయిలలో 70% కొద్దిమంది పెద్ద కార్పొరేట్ సంస్థల వలననే ఏర్పడ్డాయి అని అన్నారు.

ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, పారు బకాయిల సమస్య అనువంశికంగా సంక్రమించిందని చెప్తూ తనను ఈ నిందనుండి కాపాడుకునే ప్రయత్నం చేశారు. యు.పి.ఏ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అప్పులే ఇప్పుడు పారు బకాయిలయ్యాయని ఆయన వాదన.

యుపిఏ ప్రభుత్వం కార్పొరేట్లపట్ల ఉదారంగా ఉండేదనే దానిలో ఏమాత్రం సంశయం లేదుగాని బిజెపి ప్రభుత్వం అంత కంటే ఎక్కువగానే ఉదారంగా ఉంటున్నది. యుపిఏ ప్రభుత్వం కొద్దిమంది కార్పొరేట్లకు లక్షల కోట్లు అప్పులివ్వమని బలవంతపెడితే బిజెపి ప్రభుత్వం ఆ కార్పొరేట్లు బ్యాంకులకు రుణాలు

ఎగగొడుతుండడానికి సహకరిస్తున్నది – రిజర్వు బ్యాంకు రుణాలు రీషెడ్యూల్‌ను, తిరిగి రుణమంజూరు వంటి విధానాలను రూపొందించడం ఆధారంగా గత మూడు సంవత్సరాలలో ప్రభుత్వరంగ బ్యాంకులను రుణాలు బకాయిలను తిరిగి చెల్లింపు షెడ్యూలు మార్చే విధంగా ఒత్తిడి చేస్తున్నది. (రిజర్వు బ్యాంక్ తయారు చేసిన వివిధ పథకాలకు అనుగుణంగానే) ఈరకంగా 3.5 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలు రీషెడ్యూల్ చేయబడ్డాయి. కార్పొరేట్లు ప్రభుత్వ బ్యాంకులను వారి పిగ్గీ బ్యాంకులలాగా (చిల్లర డబ్బులు దాచుకునే ముంతలు) వాడుకుంటున్నది. ఇందువలన కంపెనీలు పాత రుణాలు కట్టడానికి కొత్త రుణాలు తీసుకుంటాయి. వారి వాయిదా కిస్తీలు కార్పొరేట్లకు అనుగుణంగా బ్యాంకులకు వ్యతిరేకంగా మార్చబడుతున్నాయి.

విజయ్ మాల్యా బ్యాంకులకు రుణాలనెలా ఎగ్గొట్టాడో ప్రజలకు ఇప్పుడు బాగా తెలుసు. కాని మోదీ గారి సొంత క్రోనీ పెట్టుబడిదారులు అంతకంటే ఎన్నో రెట్లు రుణాలు ఎగవేశారు. మోదీ ఎప్పుడూ ఉపయోగించేవి అదాని గారి విమానాలే. ఆ అదాని గారి కంపెనీలు బ్యాంకింగ్ వ్యవస్థకు రూ. 72,000 కోట్లు బకాయి ఉన్నారు. దీనిలో అధికభాగం ప్రభుత్వరంగ బ్యాంకులనుండి పొందిందే.


కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదానిగారి రెండు పవర్ (ఇంధన)కంపెనీ రుణాల కాలపరిమితి పెంచబడ్డాయి. ప్రభుత్వ బ్యాంకుల నుండి సేకరించిన ఈ రుణాలు దాదాపు రూ. 15000 కోట్లు. ఇది కంపెనీల ఆదాయాలు, పన్ను చెల్లింపులకు ముందు – రుణాలపై వడ్డీలను కూడా సరిపోనటువంటి పరిస్థితిలో జరిగింది. పాత రుణం స్థానంలో కొత్తరుణం ఇవ్వడం జరిగింది. రుణం తిరిగి చెల్లించవలసిన తేదీని ఒక దశాబ్దం పొడిగించబడింది. అంతేకాక ఈ కొంతకాలంలో వడ్డీ కట్టనవసరం లేకుండా పోయింది. అలాగే మోదీగారు కేంద్రంలో పగ్గాలు చేపట్టిన తరువాత రిలయన్స్ గ్యాస్ ట్రాన్స్‌పోర్టు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఆర్‌జిటిఐఎల్) అనే ముఖేష్ అంబానీ గారి అధీనంలో ఉన్న సంస్థకు ఒక ప్రభుత్వ రంగ బ్యాంకుచే ఉదారంగా రుణం ఇప్పించారు. ఈ సంస్థకు రూ. 4500 కోట్ల రూపాయలు అప్పు ఇప్పించారు. వాటి వాయిదాల కాల పరిమితిని ఒక దశాబ్దంపాటుకు పెంచారు.

ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన దాని ప్రకారం పారు బకాయిలయిన ఎక్కువ రుణాలు ఇంధనం, మౌలిక సదుపాయాలు, స్టీల్ రంగంలోని పరిశ్రమలకు ఇచ్చిన రుణాలే. ఈ కంపెనీలన్నీ రిలయన్స్, అదానీ, వేదాంత లాంటి పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు చెందినవే. ఈ కంపెనీలు స్థాపించేందుకు (ఒరిస్సాలో వేదాంత భూ ఆక్రమణ గుర్తుకు వచ్చి ఉంటుంది) వేల ఎకరాల రైతుల, గిరిజన భూములను వారు ఆక్రమించారు.

ఈ శతకోటీశ్వరులు, కంపెనీల అధిపతులు బ్యాంకుల రుణాలు తీర్చేందుకు బదులుగా వారి కంపెనీల వాటాలను  బ్యాంకులకు బదలాయించి ఉండవచ్చు. లేదా కంపెనీలలో కొంత అదనపు పెట్టుబడులు పెట్టాలని ఆదేశించి ఉండవచ్చు. రుణాలకు తిరిగి రుణాలిచ్చే పద్ధతి, రుణాల చెల్లింపుల కాల పరిమితి పెంచే పద్ధతి, వడ్డీ చెల్లింపుల మీద విరామం ప్రకటించే పద్ధతులను – ఆ కంపెనీదారులపై ఎటువంటి బాధ్యతను పెట్టకుండా అమలుచేస్తే రాబోయే రోజుల్లో బ్యాంకులకు మరిన్ని నష్టాలను తెచ్చిపెడతాయి..

బహుశ ప్రభుత్వం రూ. 1.5 లక్షల కోట్ల ఆస్తులున్న ముఖేష్ అంబానీకి తన కంపెనీల అప్పులు తీర్చేందుకు సహాయపడాలని కాని ఈ దేశ రైతులు మాత్రం తమ అప్పులను తీర్చలేని పరిస్థితులలో ఆత్మహత్య చేసుకున్న ఫర్వాలేదని అభిప్రాయపడి ఉండవచ్చు. రైతు భూమినన్నా అమ్ముకోవాలి. తీవ్రమయిన కరువులొచ్చి పంటపై నష్టాలొచ్చిన స్థితిలో కాని ప్రభుత్వ సహాయాన్ని కోరుకోకూడదు. తమిళనాడు, ఇతర ప్రాంతరైతులను ఏళ్ళతరబడి వెన్నాడిన అనావృష్టి కారణంగా రుణమాఫీ కోసం ఆందోళన చేస్తున్నారు. కేంద్రం చెవిలో వారి అరుపులు, కేకలు పడనేలేదు. రైతులేమన్నా విపరీత డిమాండ్లు చేస్తున్నారా? ఇది చూడండి – భారతదేశం మొత్తంమీద పంట రుణాలు రూ. 75,000 కోట్లు. ఒక్క అంబానీ కంపెనీయే బ్యాంకులకు చెల్లించాల్సిన రుణం రూ. 72,000/– కోట్లు. అయినా అదానికి రుణాలు సక్రమంగా చెల్లించనందుకు రుణాలపై తిరిగి రుణాలు మంజూరవుతాయి. కాని రైతులకు మాత్రం సవితి ప్రేమ దక్కుతుంది.

రుణాలు చెల్లించని రైతుల పేర్లు బయట పెడతారు. వారిని అవమానిస్తారు. బహిరంగంగా వారి పేర్లను ప్రకటిస్తారు. వారి వద్దనున్నవన్నీ ఏమాత్రం జాలి, దయ



చూపకుండా వేలం వేస్తారు. అలాంటప్పుడు రుణాలెగ్గొట్టిన ఈ శత కోటీశ్వరులపై అలాంటి పద్ధతులను ఎందుకు అవలంభించరు? ఇప్పటికే సుప్రీమ్ కోర్టు కూడా రుణ ఎగవేతదారుల జాబితాను ప్రకటించడం తప్పనిసరి అని చెప్పింది.

ఏరకంగా చూసిన పారుబకాయిల గందరగోళంలో ప్రజల ధనమే దుర్వినియోగం అయింది. ప్రభుత్వరంగ బ్యాంకులు అంటే ప్రభుత్వానివే అంటే ప్రజలవే. ఈ బ్యాంకులలో దాచిపెట్టబడ్డ డబ్బు ప్రజలది. ఈ బ్యాంకులలోని 60% డిపాజిట్లు సాధారణ కుటుంబాల పొదుపులే. 15% ప్రభుత్వరంగానికి చెందినవి. అంచేత బ్యాంకుల నష్టాలంటే అవి ప్రజల నష్టాలే. డిపాజిట్లు గలవారి గాను, సొంత దారులుగా కూడా. ప్రజల డబ్బును స్వాహా చేస్తున్న కార్పొరేట్లను తేరగా వదిలేసిన రిజర్వుబ్యాంకులోని మోదీ ప్రభుత్వపు గుంటనక్కలు ప్రభుత్వరంగ బ్యాంకుల రక్తం పీల్చేస్తున్నాయి. ఈ మధ్యనే రిజర్వుబ్యాంకు డిప్యూటీ చైర్మన్ విరాల్ ఆచార్య పారుబకాయిలు సంక్షోభానికి పరిష్కారం 'బ్యాంకులను తిరిగి ప్రైవేటీకరించడం, లేదా ప్రభుత్వవాటాను ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేయడం' అని సెలవిచ్చారు. రిజర్వుబ్యాంకు ఛైర్మన్ ఉర్జిత్ పటేల్ ఇందుకేం తీసిపోలేదు. ఆయన పారు బకాయిలెక్కువగా ఉన్న చిన్న బ్యాంకులను దివాలా తీయనివ్వాలని సలహా ఇచ్చారు. బహుశ 2008 నాటి సంక్షోభంనుండి భారతదేశాన్ని రక్షించినది ప్రభుత్వరంగ బ్యాంకులేనన్న సంగతి ఈ రిజర్వుబ్యాంకు అధికారులు మరిచిపోయినట్టున్నారు.

నిజం చెప్పాలంటే భారతదేశ బ్యాంకులను కొనగల మొనగాళ్లెవరు? మళ్ళీ ఆ పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలే. ప్రభుత్వరంగ బ్యాంకులలోని తమకున్న 5 లక్షల కోట్ల అప్పులలో అత్యధిక భాగం పారు బకాయిలను చేసిన అవే కంపెనీలు! అంటే ప్రభుత్వ రంగ బ్యాంకులలోని ప్రజల ధనాన్ని ఎగ్గొట్టిన వారికే వారి ఘనమైన చర్యలకు బదులుగా ప్రభుత్వరంగ బ్యాంకులకు అప్పచెప్పే ప్రయత్నం అని స్పష్టంగా తెలుస్తున్నది!

ప్రభుత్వ బ్యాంకుల కష్టాలకు కారణమైన వారికే వాటిని అప్పచెప్పాలనుకునే ఆలోచనను ఊహిస్తుంటేనే దిమ్మదిరిగిపోతున్నది. ఆశ్రిత పెట్టుబడి ఈ ప్రస్తుత ప్రభుత్వాన్ని దాని పరిపాలనా యంత్రాంగాన్ని ఎంతగా ప్రభావితం చేస్తున్నదో అర్థం అవుతున్నది.

మోదీ మూడేళ్ళ పాలనలో కార్పొరేట్ సంస్థలకు ఒకదాని తరువాత ఒకటి ప్రత్యేక సదుపాయాలు కల్పించబడుతూనే ఉన్నాయి. ఈ పద్ధతి మారే సూచనలు కూడా ఏంలేవు. తనను ప్రభుత్వంలో కూచోపెట్టిన వారిని కంటికి రెప్పలా ఆదుకుంటూ వారి ఆర్థిక వ్యాపార నష్టాల ఫలితాలు, వారు అనుభవించకుండా కాపాడుకుంటున్నారు

మోదీ. ఇప్పుడు ఆయన కార్పొరేట్లు రాజకీయ పార్టీలకు పేరు బయట పెట్టక్కర్లేకుండా చందాలిచ్చేందుకు వీలుగా చట్టాన్ని మార్చారు. దీనితో  ఆయన ఎలక్షన్‌ల ప్రచారానికి నిధుల అంతులేని వరద పారుతుంది. కార్పొరేట్ సంస్థల కృతజ్ఞతకు సూచకంగా.

★

# మూడేళ్ళ మోదీ పాలన

## మోదీ రాజ్యంలో మహిళలు

మూడేళ్ళ మోదీ పరిపాలనలో మహిళల గతేంటి? ఒక మాటలో చెప్పాలంటే, సర్వనాశనం. మహిళా కార్యక్రమాలకు బడ్జెట్‌లో కోతలు విధించారు. కనుచూపుమేరలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు లేవు; మహిళలపై హింస కొనసాగుతూనే ఉంది. అన్నింటికన్నా ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారంలో నాయకులు మధ్యయుగాలలో లాగా మహిళలను నాలుగు గోడల మధ్య బంధించాలని బోధనలు చేస్తున్నారు. మహిళలు సరిగ్గా వస్త్రధారణ చేయాలనీ, పురుషులపట్ల గౌరవంగా మెలగాలని సూచిస్తున్నారు. అందువల్ల మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభుత్వ ఎజెండాలోనే లేదన్న విషయం ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు.

**మహిళలపై ప్రభుత్వం పెట్టే ఖర్చులో కోత**

గత రెండేళ్లుగా సాధారణ బడ్జెట్‌లో మహిళల పద్దుపై భారీగా కోతపడుతున్నది. అది కొనసాగుతూనే ఉంది. అరుణ్‌జెట్లీ బడ్జెట్ ప్రవేశ పెట్టిన రోజు దానిని మహిళల బడ్జెట్ అనీ మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ చెప్పుతుంది. అయితే అంకెలు ఏం చెపుతున్నాయో చూద్దాం.

లింగ ప్రాతిపదికన చూస్తే ఈ ఏటి బడ్జెట్ ఎంతో నిరాశను మిగిల్చింది. ఎన్నో పథకాలలో, కార్యక్రమాలలో మహిళలకు ప్రత్యేకమైన కేటాయింపులే లేవు. పశుపోషణ, మత్స్య పరిశ్రమ ఎక్కువమంది మహిళలకు ఉపాధికల్పించే రెండు రంగాలు. వీటిలోని మహిళలకు ప్రత్యేక కేటాయింపులే లేవు. ఎన్నోరకాల వ్యవసాయ ఆధారిత పథకాల పరిస్థితీ ఇదే. ఆహార పథకానికి సంబంధించిన భారతీయ ఆహార భద్రతా పథకం ఒక్కదానిలో కేవలం రూ.60 కోట్లు మహిళలకు ప్రత్యేక కేటాయింపులు చేశారు.

ఆర్థిక సర్వే ప్రకారం 2016-17లో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి కల్పన పథకంలో 57% మహిళలు పాల్గొంటున్నారు. ఆర్థిక మంత్రిత్వశాఖ ఈ పథకం కేటాయింపులు 26% పెంచామని చెప్పుకుంటున్నారు. 2016-17లో రూ.38,500 కోట్లున్న కేటాయింపులను 2017-18లో రూ.48,000 కోట్లకు పెంచారు కాని ఈ పథకం మార్చిన అంచనాలు రూ.47,499 కోట్లు. అంటే ఈ ఏటికన్నా 1% మాత్రమే పెరిగింది. మోదీ ప్రభుత్వానికి అంకెల గారడీ అంటే మహాప్రీతి! కాస్త నిశితంగా పరిశీలిస్తే నిజాలు బయటపడిపోతాయి. ఎమ్‌జిఎన్ఆర్ఇజిఎస్ (MGNREGS) పథకం కింద వేతన చెల్లింపులు సక్రమంగా ఉండవన్న సంగతి మనందరికీ తెలుసు. వీరు మన కార్మికులలోనే అత్యంత నిరుపేదలు. వారికి వారి వేతనాలే జీవనాధారం. ఆర్థిక మంత్రి పెంచిన ఒక్క శాతం ఈ పథకంలో చెల్లింపులు చేయకుండా ఉండడాన్ని ఆపగలదా?

సమగ్ర శిశు అభివృద్ధి పథకం మహిళలను మాత్రమే నియమిస్తుంది. ఇది 0-6 మధ్య వయసున్న పిల్లల పోషక అవసరాలను పూరిస్తుంది. మే 2015న మహిళాశిశు అభివృద్ధి మంత్రిణి, శ్రీమతి మేనకా గాంధీ ఈ పథకంక్రింద 24.58 లక్షలమంది మహిళలు పనిచేస్తున్నట్టు రాజ్యసభలో ప్రకటించారు. ఈ మహిళలు శ్రామికులుగా గుర్తించబడడంలేదు. వారి సేవలకుగాను ఇస్తున్నది గౌరవవేతనమే. అనేక సంవత్సరాలనుండి అంగన్‌వాడీ పనివారు తమను ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంతకు ముందున్న కాంగ్రెస్ ప్రభుత్వంలాగానే మోదీ ప్రభుత్వం కూడా వారి న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేస్తున్నది. ఈ శ్రామికులు తమ గౌరవవేతనాన్ని కూడా క్రమం తప్పకుండా పొందలేదు. మహిళా శిశు అభివృద్ధి శాఖ మంత్రిత్వ లెక్కల ప్రకారమే 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం 50% బడ్జెట్ కోతకు గురి అయ్యింది. అలాగే 2016-17లో మరో 6% నిధులు కోత పెట్టారు. ఈ యేడు కేవలం రూ.34.79 కోట్లు పెంచారు. రూ.411.68 కోట్లనుండి పునరంచనాల ప్రకారం (2016-17) రూ.446.47 కోట్లకు పెంచారు. ఈ 'పెంపుదల' ఎంతో ముఖ్యమైన ఈ పథక అవసరాలకు ఏమాత్రం సరిపోదు. కొత్త సంవత్సరంలో కాబోయే తల్లులకు కొత్త మాతృత్వ ప్రయోజన పథకాన్ని ప్రవేశపెడతానని మోదీ చెప్పుకున్నారు. నిజానికి ఇది ఇప్పటికే అమలులో ఉన్న పథకమే. 2010లో ఇందిరా గాంధీ మాతృత్వ సహయోగ్ యోజనగా మొదలయి 2013లో జాతీయ ఆహారభద్రత పథకం క్రిందికి తేబడింది. 2017మే 17 న జరిగిన కాబినెట్ సమావేశంలో ఈ పథకాన్ని మొదటి శిశువుకు మాత్రమే వర్తింపచేయాలని నిర్ణయించారు. అంతకు ముందు ఇది బతికున్న మొదటి ఇద్దరు పిల్లలకు వర్తించేది.

దీనివలన అనేక మంది మహిళలకు ఈ పథకం వర్తించకుండా పోతుంది. జాతీయ ఆహార భద్రతను ఉల్లంఘిస్తూ అంతకు ముందు తల్లులకు ఇస్తున్న రూ.6000/–లను రూ.5000/–లకు కుదించారు. ఇదికూడా ఆధార్ కార్డుకు అనుసంధానం చేసారు. ఫలితంగా వేలాది మహిళలు ఈ మాత్రం ప్రయోజనం కూడా పొందలేకపోతున్నారు. 2017లో మోదీ ప్రభుత్వం ఈ పథకానికి రూ.2700 కోట్లు కేటాయించింది. అంటే భారతదేశంలో ఒక ఏడాదిలో 2.6 కోట్ల మంది జన్మిస్తుండగా ఇది అందులోని 17% మందికి మాత్రమే వర్తిస్తుంది. ఇటువంటి విధానాలను అనుసరిస్తున్నందువలన మోదీ ప్రభుత్వం, మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వానికున్న బాధ్యతనుండి తప్పించుకోవాలనుకుంటున్నట్టు స్పష్టంగా అర్థం అవుతున్నది.

**మహిళలకు పనిలేదు**

లేబర్‌బ్యూరో ప్రకటించిన గణాంకాల ప్రకారం 2016లో 15సం॥ దాటిన మహిలలో 22% మందే పనిలో ఉండగా 74% ఈ వయసు మగ వారు పనిలో ఉన్నారు. నగరాలలో అయితే 14% మాత్రమే పనిలో ఉన్నారు. పనిలో లింగ సమానతలను చూసినప్పుడు భారతదేశం ప్రపంచంలోని 145 దేశాలలో 136వ స్థానంలో ఉంది. ఇది ఆశ్చర్యమైన విషయంగాని కొత్తది గాని కాదు. ఎంతోకాలంగా ఈ పరిస్థితి కొనసాగుతూనే ఉంది. అయితే మోదీ ప్రభుత్వం దీనిని అసలు పట్టించుకోవడం లేదు. మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఎటువంటి ప్రోత్సాహక విధానాలూ రూపొందించలేదు. మహిళలకు నైపుణ్యంలో శిక్షణ అంటే సౌందర్యం ఇనుమడింపచేయడానికో, దర్జీ పనికో పరిమితమవుతున్నది. పని ప్రదేశంలో మహిళల రక్షణకు గాని భద్రతకు గాని ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. మునుపటిలా ఒక పనిలో ఉన్న పురుషులకు స్త్రీలకు ఉన్న వేతన భేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మాతృత్వ సెలవులుగాని, అందుకు సంబంధించి క్రెష్‌లాంటి సౌకర్యాలు గాని పని ప్రదేశాలలో ఎక్కువ మంది మహిళలకు అందుబాటులో లేవు. చిన్నచిన్న పరిశ్రమల మాట అటుంచి ఈ సౌకర్యాలు అత్యంత అధునాతన పరిశ్రమలలో కూడా లేవు.

ఫలితంగా నిరుద్యోగ మహిళలు 8.7%గా, అంటే పురుషుల కన్నా రెట్టింపుగా ఉన్నట్టు ఈ రిపోర్టు చెపుతున్నది. అయితే ఉద్యోగం చేయాలనుకున్నా ఉద్యోగం దొరకలేదని చెప్పిన వారినే ఇందులో చేర్చినట్టు గణాంక శాఖ వివరించింది. ఎంతోమంది మహిళలు ఎంతో అవసరమైన పరిస్థితిలో కూడా ఉపాధి పొందే అవకాశాలు లేక ఇంటికే పరిమితమవ్వాల్సి వస్తున్నది. ఇందుకు పితృస్వామ్య

భావజాలం కూడా కారణమే. ఇది వారి సిద్ధాంతానికి పూర్తిగా అనుగుణంగా ఉన్నందువలన దీని గురించి మోదీ ప్రభుత్వం ఏమాత్రం విచారించడం లేదు.

2015లో మహిళా శిశు అభివృద్ధి మంత్రిణి మేనకా గాంధీ, ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి అరుణ్‌జైట్లీని కంపెనీలు తప్పని సరిగా లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా కమిటీలను తమ కంపెనీలలో నియమించారో లేదో తెలిపి తీరాలనే నియమాన్ని పెట్టమని ప్రతిపాదించారు. అరుణ్ జెట్లీ దీన్ని తిరస్కరించారు. కంపెనీల ప్రతినిధులు ఈ రకమైన తమ సంస్థల వివరాలు ప్రకటించడానికి ఇష్టపడడం లేదనీ, అదంతగా అవసరం కూడా లేదని అభిప్రాయపడ్డారు. ఇది పారిశ్రామికవేత్తల సంతృప్తే ముఖ్యం గాని పని ప్రదేశాలలో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ప్రతి పరిశ్రమలోనూ కమిటీలు వేయాలన్న విశాఖ మార్గదర్శకాల అమలు ముఖ్యం కాదన్న విషయాన్ని తెలియజేస్తున్నది.

**మహిళల పట్ల హిందూత్వ ప్రభావం**

విధానాలలో గాని వాటి అమలులోగాని పొరపాట్లను సరిచేయడం సులువే. కాని మోదీ ప్రభుత్వం దాని మూలం అయిన ఆర్ఎస్ఎస్ రూపొందిస్తున్న సమాజాన్ని మార్చడం మాత్రం అంత సులువు కాదు. వారు మహిళా వ్యతిరేక ఎజెండాను అత్యంత శక్తివంతంగా ప్రచారం చేస్తున్నారు. బిజెపి నాయకులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు క్రమం తప్పకుండా మహిళలపై చేస్తున్న వ్యాఖ్యలే ఇందుకు తార్కాణం.

ఈ యేడు మహిళా శిశు అభివృద్ధి మంత్రిణి మేనకాగాంధీ చేసిన ఓ ప్రకటన ఆమెను ప్రజల ఆగ్రహానికి గురిచేసింది. ఆమె మహిళలు తమ హాస్టళ్లకు చీకటి పడకముందే చేరుకోవడం వారికే రక్షణ నిస్తుందని అన్నారు. 16–17 ఏళ్ళ వయసులో హార్మోన్ల ప్రభావం ఉంటుందని అందువలన వాటి విస్ఫోటాలను నియంత్రించాలంటే 'లక్ష్మణరేఖ'లు ఉండడం అవసరమని అన్నారు. ఆమె తర్కం ప్రకారం మహిళల రక్షణకు వారే బాధ్యులు. అందువలన వారు గృహాలలో ఉండి తమను తాము రక్షించుకోవాలి. యువతులలో హార్మోన్ల సమతుల్యం తక్కువగాబట్టి వారిని సమాజంలోకి వదిలివేయకూడదు. పితృస్వామ్య సాధారణ భావజాలమయిన రక్షణకోసం మహిళలను గృహాలకే పరిమితం చేయాలన్న ఆలోచనను ఆమె సమర్థిస్తున్నారు.

యోగి ఆదిత్యనాథ్‌ను, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రతిపాదించడంలోనే ప్రభుత్వం తన 'హిందూత్వ' ఎజెండాను అమలుపరిచేందుకు దృఢ సంకల్పంతో ఉందన్న విషయాన్ని తెలియజేస్తున్నది. ఈ 'హిందూత్వం' మహిళల పాలిట శాపం. ఈ పెద్దమనిషే ఒక ప్రసంగంలో 'లవ్‌జిహాద్'కు ప్రతీకారంగా పూడ్చిపెట్టిన ముస్లిం మహిళల శవాలను వెలికితీసి మానభంగాలు చేయాలని అన్నారు. ఒక మహిళను

(చనిపోయినా, బ్రతికి వున్నా) అత్యాచారానికి గురి చేసే ఆలోచన గలిగిన ఒక వ్యక్తి నేడు భారతదేశంలోనే అతిపెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నాడు. ఆర్ఎస్ఎస్ దాని రాజకీయ విభాగమయిన బిజెపి ఇటువంటి సిద్ధాంతాన్ని కలిగివుంది.

ముఖ్యమంత్రి పీఠం అధిష్టించిన వెంటనే యోగీ ఆదిత్యనాథ్ యువతులను వేధించడాన్ని అరికట్టేందుకు 'రోమియో వ్యతిరేక' విభాగాలను తయారు చేయాలని పోలీసులను ఆదేశించారు. కాని మాధ్యమాలలో, ముఖ్యంగా సామాజిక మాధ్యమాలలో చూస్తే యువతులను రక్షించే బదులు వీరు భార్యాభర్తలపై దాడులు చేయడం నమోదవుతున్నది. అంటే దీని అసలు ఉద్దేశం మహిళలను రక్షించడం కాదు, మతాంతర కులాంతర వివాహాలను ఆపే ప్రయత్నానికి ఓ ముసుగని అర్థం అవుతున్నది. ఇది మహిళ జీవిత భాగస్వామిని ఎన్నుకునే హక్కుపై దాడి చేయడమే.

అలాగే మనోహర్ లాల్ ఖతార్ అనే బిజెపి నాయకుడు భారతదేశంలో మహిళలపై అత్యాచారాలు పెరగడానికి మహిళలే కారణమని ఉద్ఘాటించారు. ఆయన గత మూడేళ్లుగా హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు.

**మహిళలపై హింస**

బిజెపి నాయకులు ఎంతగా 'మీ అమ్మల మీ అక్కల' రక్షణే మా ధ్యేయం అని డాంభికాలకి పోతున్నప్పటికీ మహిళపై జరుగుతున్న అనేక రకాలయిన హింస మోదీ రాజ్యంలో కొనసాగుతూనే ఉన్నది. పోలీసుల రికార్డులలో వాస్తవంగా జరిగే వాటిలో ఏకొద్ది ఘటనలో నమోదవుతాయి. అయినా వాటిలోనూ అత్యాచారాలు, అత్యాచార ప్రయత్నాలు, ఎత్తుకొని పోవడం, దాడులు, గృహహింస తదితర అన్ని రకాలయిన హింసలూ 2013 కన్నా 2015లో అధికంగా జరిగినట్టు నమోదయ్యాయి. ఆశ్చర్యంగా వరకట్నానికి సంబంధించిన విభాగాలలో తరుగుదల నమోదయ్యింది. బహుశ సంఘ్‌పరివార్ దాని రాజకీయ విభాగం బిజెపి వరకట్నాన్ని బలహీనతగా పరిగణిస్తూ దాని వలన సంభవించే వరకట్న హత్యలను నీచమైనవిగా చూడడం, వాటిని ప్రతిఘటించడం వలన అయి వుండవచ్చు.

అందువలన పోలీసులు, వీటిని తక్కువగా నమోదు చేసి ఉండవచ్చు. మొత్తంగా ఈ మూడేళ్ళ కాలం మహిళల పట్ల హింస పెరుగుదల 5.8%గా నమోదయ్యింది.

ఎప్పటికన్నా మోదీ పరిపాలనలో మహిళల పట్ల నేరం చేసిన వారిపై శిక్షలు మరింత తక్కువగా పడ్డాయి. అత్యాచారం, అత్యాచార యత్నాలు, అపహరణలు, కొద్దిగానే పెరిగినట్టు నమోదయినా, నేరారోపణలు ఎదుర్కొంటూ అరెస్టు చేయబడిన వారిలో మూడొంతుల మందిని కోర్టులు విడుదల చేసాయి. 'మహిళల గౌరవాన్ని భంగపరచడం', 'అవమానించడం', భర్తల కసాయితనం, అత్తింటి ఆరడులు –

2013–2015 మధ్య మోదీగారి పరిపాలనలో నిజానికి తగ్గినట్టు నమోదయ్యాయి. మొత్తంగా చూస్తే మోదీ గారి మూడేళ్ళ పాలనలో మహిళల పట్ల జరిగిన నేరాలలో శిక్షించబడిన వారిశాతం 2013లో 22.4%గా ఉండగా 2015 నాటికి 21.7%కి తగ్గింది.

| **మహిళల పట్ల జరిగిన పెద్దనేరాలు** | **పెరిగిన % (2013–15)** |
|---|---|
| అత్యాచారం | 2.8 |
| అత్యాచార ప్రయత్నం | 4.8 |
| అపహరణలు | 14.3 |
| గౌరవం భంగపరిచే దాడులు | 16.5 |
| ఆత్మహత్యా ప్రయత్నాలు | 8.7 |
| గృహహింస | 8.2 |
| వరకట్న హత్యలు | – 5.5 |
| భర్త, అత్తవారింటి పోరు | – 4.5 |
| వరకట్న నివారణ చట్టం | – 7.6 |
| మొత్తంగా | 5.8 |

**మూలం : NCRB**

క్రితం సంవత్సరం నుండీ మోదీ ప్రభుత్వం ముస్లిం మహిళల విముక్తి కోసం పాటుపడుతున్నది. ముమ్మారు చెప్పే తలక్‌ను రద్దు చేయాలనుకుంటున్నది. ఈ ఆచారం చెడ్డదే. అందులో సందేహం లేదు. కాని మోదీ ప్రభుత్వం మహిళలను ఉద్ధరించేందుకే ఈ చర్యకు పూనుకుంటున్నదా? అలా అనిపించడం లేదు. ఎందుకంటే మోదీ దీనిని అందరికీ ఒకే కోడ్ ఉంటుందని సమర్థిస్తున్నారు. ఈ 'ఒకేరకం' అన్నదాని స్వరూపం, స్వభావం ఏమిటి? ఆర్‌ఎస్‌ఎస్ భారతదేశాన్ని 'హిందూ రాష్ట్రం'గా తయారు చేయాలనుకుంటుందన్న విషయం మనందరికీ తెలుసు. అంటే ఆర్‌ఎస్‌ఎస్ తన కలను సాకారం చేసుకునేందుకు భిన్న సంస్కృతులున్న ఈ దేశాన్ని ఒకే సాంస్కృతిక చట్రంలోకి తేవాలనుకుంటున్నది.

అదే సమయంలో హిందుఇజాన్ని రక్షించడమే ప్రథమ కర్తవ్యంగా చెప్పుకుంటున్న మోదీగాని, అతని ప్రీతిపాత్రమయిన సంఘ్‌పరివార్‌గాని అత్యధికులలో మహిళల పట్ల నీచంగా ఉన్న అనేక సాంప్రదాయాలకు వ్యతిరేకంగా తమ గళం విప్పలేదు. వరకట్నం, వరకట్న హత్యలు, మగబిడ్డలనే కోరుకోవడం వలన ఆడశిశువుల భ్రూణ హత్యలూ, మరెన్నో మహిళలను మగవారికి బానిసలను చేసే తతంగాలు, అలవాట్లకు వ్యతిరేకంగా ఎన్నడూ పెదవి విప్పింది లేదు. హిందువులలో ఉన్న

దురాచారాలను చూసి చూడనట్టు వదిలేసి కేవలం ఇస్లామ్ మతంలోని ముమ్మారు తలాక్‌ను సంస్కరించేందుకు సిద్ధపడి, ఒక సంస్కర్తగా చూపుకోవడం ప్రభుత్వం యొక్క నిజాయితీ తనాన్ని బహిర్గతం చేస్తున్నది.

అందువలన మోదీ రాజ్యంలో ఒక మహిళగా ఉండడమంటే ఏమిటి? మహిళలు మరుగున పడడమే! పితృస్వామిక సమాజానికి వారి సేవలు అవసరమయినన్నాళ్లు వారు మరుగునే ఉంటారు.

★

# మూడేళ్ళ మోదీ పాలన
# అమ్మకానికి దేశం

మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరించడాన్ని వేగవంతం చేసింది. మన ఆర్థికవ్యవస్థను 'అత్యున్నత శిఖరాలకు' తీసుకువెళ్ళేందుకు దేశ ప్రభుత్వరంగాన్ని విచ్ఛిన్నం చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నది. ఈ రోజు ప్రభుత్వ రంగం జాతీయ ఆస్తులైన భూమి, గనులు, మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి శక్తులతో అలరారుతున్నది. ఇదంతా జాతి సంపద. విదేశీ పెట్టుబడులను 100% రక్షణ, రైల్వేలు, టెలికాం, పౌరవిమాన యానం, సాటిలైట్లు, విద్యుత్తు, పెట్రోలియం, బొగ్గువంటి కీలక రంగాలలో అనుమతించేందుకు నిర్ణయించడం దేశ వ్యతిరేక చర్య తీసుకోవడమే. దీనివలన ప్రభుత్వ రంగ సంస్థల పని దెబ్బతినడమే కాదు జాతి భద్రతకు కూడా ముప్పు ఏర్పడుతుంది. మన జాతి అమూల్య సంపదను కార్పొరేట్లకు స్వదేశీయులైనా, విదేశీయులైనా అప్పజెప్పడం కంటే, జాతి వ్యతిరేకత మరేదైనా ఉంటుందా?

* కాంగ్రెస్ ప్రభుత్వం 1999లో నూతన ఆర్థిక విధానాలను అనుసరించడం మొదలు పెట్టిన నాటినుండి ప్రభుత్వరంగాన్ని నాశనం చేయడం ప్రభుత్వ ఎజెండాలో భాగమయిపోయింది. స్వయం ప్రతిపత్తి ఆర్థిక రంగం, ఆర్థిక సార్వభౌమత్వం, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి, సామాజిక న్యాయం మరుగునపడిపోయాయి. ఈ విధానాలను మోదీ ప్రభుత్వం మరింత తీవ్రంగా అమలుచేస్తున్నది.

*2014లో అధికారం చేపట్టగానే మోదీ ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్ని ఎత్తివేసింది. దీని స్థానంలో నీతిఆయోగ్‌ను నియమించింది. ఏయే ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మాలో, వేటి వాటాలు వదిలించుకోవాలో గుర్తించి జాబితాను తయారు చేయాల్సిన బాధ్యతను నీతి ఆయోగ్‌కి అప్పజెప్పడం జరిగింది. నీతిఆయోగ్ ఇప్పటికే ఆ పని పూర్తిచేసింది. – 74 ప్రభుత్వ రంగ సంస్థలను, అందులో 26 మూసేయాల్సినవి,

10 కీలక పెట్టుబడుల ఉపసంహరణ చేయాల్సినవి ఉన్నాయని గుర్తించింది. (పెట్టుబడుల ఉపసంహరణ అంటే యాజమాన్యం ప్రభుత్వం చేతిలో ఉంటుంది. కీలక అమ్మకం అంటే అత్యధిక వాటాలు అమ్మినందువలన యాజమాన్యం ప్రైవేటు వ్యక్తులకు పోతుంది) సూత్రప్రాయంగా ప్రభుత్వం నీతి ఆయోగ్ ప్రతిపాదనలను అంగీకరించింది.

*మన ఆర్థిక వ్యవస్థ కీలక ప్రభుత్వ రంగ సంస్థలయిన పది పరిశ్రమలు ఓఎన్‌జిసి, గైల్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, కోల్ ఇండియా లిమిటెడ్, బిహెచ్ఇఎల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మొదలైన సంస్థలను అమ్మకంలో సలహాలను ఇచ్చేందుకు, త్వరగా అమ్మిపెట్టేందుకు రిలయన్స్ మ్యూచ్యువల్ ఫండ్ మేనేజర్స్‌కి అనుమతి ఇచ్చింది. ఈ అమ్మకం ఎక్స్ఛేంజ్ ఫండ్ ద్వారా జరగనుంది. ఇది దొంగ చేతికి ఇంటి తాళాలు ఇవ్వడమే. రిలయన్స్ మాతృసంస్థే ప్రభుత్వ రంగం కారుచవుకగా అమ్ముడుపోవాలని కోరుకుంటున్నది!

*కీలక అమ్మకాలకోసం ప్రతిపాదించిన వాటిలో భారత్ ఎర్త్‌మూవర్స్ లిమిటెడ్ (బిఇఎమ్ఎల్) ఉంది. ఇది రక్షణ ఉత్పత్తులను తయారుచేసే తొమ్మిది కీలక సంస్థలలో ఒకటి. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAIL) యొక్క సాలెం, దుర్గాపూర్, భద్రావతి పరిశ్రమలు, ప్రభుత్వ రంగంలో మాణిక్యంలాంటి చిన్న పరిశ్రమ బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హిందూస్థాన్ ఫ్లూరో కార్బన్స్ మొదలయినవి ఉన్నాయి. రక్షణ మంత్రిత్వ శాఖ రక్షణ విభాగంలోని ప్రభుత్వరంగ సంస్థలైన బిడిఎల్, మిథాని మొదలైన సంస్థలను కూడా వాటాల విక్రయాలు చేసి పెట్టుబడులు ఉపసంహరించుకునే క్రియలను వెనువెంటనే చేపట్టమని ఆజ్ఞ జారీ చేసింది. కనీసం 25% పెట్టుబడులను ఉపసంహరించుకోవాలనుకుంటున్నది.

*జాతీయ, అంతర్జాతీయ ప్రైవేటు సంస్థలకు 25% సాధారణ ఇన్సూరెన్సు రంగ వాటాలను ప్రభుత్వం అమ్మబోతున్నది.

దేశ కోశాగారానికి ప్రభుత్వరంగ సంస్థలు ఎంతో ఆదాయాన్ని సమకూర్చి పెడతాయి. అవి పన్నులను సక్రమంగా కట్టడమే కాదు డివిడెండ్లను, ప్రత్యేక డివిడెండ్లను కూడా సక్రమంగా ప్రకటిస్తాయి. అంతేకాదు ఏడాదికి రూ.1.5 లక్షల కోట్లు దేశ మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు పెట్టి దేశాన్ని ప్రగతి బాట నడిపిస్తాయి. 2014-15లో ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ బొక్కసానికి రూ.2 లక్షల కోట్లు సమకూర్చిపెట్టాయి.

*ఇందుకు భిన్నంగా దేశీయమైనా, విదేశీయమైనా ప్రైవేటు సంస్థలు లెక్కలు తారుమారు చేసిన పన్నులు ఎగగొట్టిన ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వమే

ఏడాదికి ఐదు లక్షల కోట్లు ఈ రకంగా బొక్కసానికి నష్టం కలిగిస్తున్నాయని చెపుతున్నది. ఒక్క 2015-16లోనే రూ.6.59 లక్షల కోట్లు ప్రత్యక్ష పన్నులు ఎగవేయడం జరిగింది.

*బిజెపి ప్రభుత్వం పథకం ప్రకారమే ప్రభుత్వరంగ సంస్థలను నష్టాలకు గురిచేసి బలహీనపరిచి తద్వారా ప్రైవేటికరించే ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలలోని మిగులును, వాటిని ఆధునీకరించడానికి, నిరంతరం తాజా మార్పులను చేయడానికి బదులుగా నిధులను దారి మళ్ళిస్తున్నది. ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను, అవి చట్టప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన దానికంటే ఎక్కువ, ఒక్కొక్కసారి 50% కూడా ప్రభుత్వానికి చెల్లించేటట్టు ఒత్తిడి చేస్తున్నది. ఇవి వాటిని నష్టాలకు గురిచేసి తద్వారా ప్రైవేటు వారికి, స్వదేశీ అయినా, విదేశీ అయినా అనువుగా ధరలు నిర్ణయించి విక్రయించేందుకు చేస్తున్న పన్నాగమే.

*భారత ప్రభుత్వం ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మసిటికల్స్ లిమిటెడ్‌ను, రాజస్థాన్ డ్రగ్స్ అండ్ ఫార్మసిటికల్స్ లిమిటెడ్‌ను మూసేయాలని నిర్ణయించుకుంది. కొనేవాళ్లుంటే హిందూస్థాన్ యాంటీ బయాటిక్స్ లిమిటెడ్(HAL) , బెంగాల్ కెమికల్స్ అండ్ ఫార్మసిటికల్స్ లిమిటెడ్ (BCPL) లను అమ్మేందుకు సిద్ధంగా ఉంది. లేదా వాటిని మూసేస్తుంది. ఇప్పటికీ ఈ సంస్థలలో పెట్టుబడులను పెంచి వీటికి పెద్దమొత్తంలో ఉన్న ఆస్తులను ఉపయోగించి, వీటిని లాభదాయకంగా నడపవచ్చు. కాని ప్రభుత్వానికి ఆ ఉద్దేశం లేదు. మోదీ తన 'భారతదేశ తయారీ' నినాదాన్ని తానే అపహాస్యం చేసుకుంటున్నారు.

*మనదేశంలో ప్రభుత్వరంగం దేశాన్ని స్వయం సమృద్ధి గల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే ఆయుధంగానూ పారిశ్రామిక భూమికను తయారు చేసే సాధనంగా ఉంది. సమతుల్య అభివృద్ధి సాధించడంలో కీలక పాత్ర వహించాయి. దేశంలో పెద్ద పెద్ద మౌలిక వసతుల కల్పనలోనూ, ఇంధనం, రవాణా రంగాన్ని రైల్వేలు, రోడ్డు, పోర్టులతో సహా ప్రభుత్వ రంగం అభివృద్ధి చేసింది. ప్రైవేటు రంగం వెన్వెంటనే లాభాలురాని, పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాల్సిన ఇటువంటి రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు సమర్థతలేకపోయినా లేదా పెట్టె రిస్క్ తీసుకునేందుకు ఇష్టపడకపోవడం వలననైనా ముందుకు రాలేదు. వీటన్నింటినీ ప్రభుత్వరంగమే ప్రారంభించింది. ప్రభుత్వరంగంలోనే బొగ్గు, హైడ్రో, న్యూక్లియర్ విద్యుత్ ప్రాజెక్టులు, రవాణా, సమాచార రంగం, స్టీల్ ఉత్పత్తి, ఆయుధాల ఉపకరణాల ఉత్పత్తి, ఓడల తయారీ, పెట్రోలు, బొగ్గు పరిశ్రమలు ప్రారంభించబడ్డాయి. మనం సాంకేతికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంలో ప్రభుత్వ రంగంలోని పరిశోధన అభివృద్ధి ఎంతో కీలక పాత్ర పోషించాయి.

*రైతులకు కొత్త విధానాలు తెలియజెప్పడంలోనూ, వ్యవసాయ ఉత్పత్తి పెంచడంలోనూ మన ప్రభుత్వ రంగ పరిశోధనా సంస్థలు ఎంతో కీలక పాత్ర పోషించాయి.

*దేశమౌలిక సదుపాయాల కల్పనలోనూ, త్రాగునీటి ప్రాజెక్టులలోనూ జీవిత భీమా సంస్థ పెట్టుబడులు పెడుతుండేది. 2008లో ప్రపంచ ఆర్థిక పతనం నుండి భారతదేశాన్ని కాపాడింది ఆనాటి ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థలేనని ఇప్పుడందరూ అంగీకరిస్తున్నారు. నిజానికి, ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజలనుండి వారి పొదుపులు ప్రైవేటు కంపెనీలు కొల్లగొట్టకుండా ఉండేందుకు, వాటిని తిరిగి ప్రజల ప్రయోజనాలకు, ముఖ్యంగా మారుమూల గ్రామీణ పేద ప్రజలకు, ఉపయోగించాలన్న ఉద్దేశంతోనే ఈ ఆర్థిక సంస్థలైన బ్యాంకులను భీమా సంస్థలకు జాతీయ చేయడం జరిగింది.

*ప్రైవేటు సంస్థలలో అవకాశం లేని సంఘాల ఏర్పాటు, జీతాల బేరసారాలు చేసుకునే హక్కులు ప్రభుత్వ రంగం వలనే సాధ్యపడింది. ప్రభుత్వరంగ సంస్థలలోని ఈ పోరాటాలు, విజయాల ద్వారా మెరుగైన పని, జీవన పరిస్థితులు ఇతర రంగాలలోని కార్మికులను తాము కూడా సంఘాలేర్పరుచుకునే హక్కులకోసం, ఇతర హక్కులకోసం పోరాడేందుకు ఉత్సాహపరిచాయి.

*అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ప్రభుత్వరంగాలు ఏర్పాటు చేయడంవలన, ఆ మారుమూల ప్రాంతాలలో కార్మికులకు ఇళ్లు కట్టించడం, వారి పిల్లలకు బడులు, వారికి వైద్య సదుపాయాలు, కమ్యూనిటీ సెంటర్లు, షాపింగ్ కాంప్లెక్సులూ కట్టించినందువలన ఆ ప్రాంతం అంతా అభివృద్ధి చెందింది. అందువలన దానికి చుట్టుప్రక్కలనున్న అనేక గ్రామాలకు ప్రయోజనం చేకూరింది. వారికి ఉద్యోగావకాశాలు వచ్చాయి. అక్కడి ప్రజలకు రకరకాల సేవలు చేసే అవకాశం రావడం వలన ఆసేవలను అందించే వారి ఆదాయాలూ పెరిగాయి.


*ప్రభుత్వ రంగం సంస్థలలో ఎస్‌సి, ఎస్‌టి (దళితులు, గిరిజనులకు) లకు రిజర్వేషన్ అమలు చేసినందువలన వారి అభివృద్ధికి అవకాశాలు ఏర్పడి వారికి సామాజిక న్యాయం ఒనగూడింది.

*ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేయడం అంటే మన దేశ ఆర్థిక వ్యవస్థను, మన స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని, ప్రయోజనాలను అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల వశం చేయడమే. అంటే మన జాతీయ సంపదను, ఆస్తులను బంగారు పళ్ళెంలో పెట్టి కార్పొరేట్లకు అప్పజెప్పడమే. లాభాలవేటలో మునిగి తేలుతున్న వారికి మన కార్మికులను విపరీతంగా

దోచుకునేందుకు అప్పజెప్పడమే. వారిని బానిసత్వంలోకి నెట్టడమే. ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కులను కాలరాయడమే. ఇది చివరకు ప్రజాస్వామ్య నిర్మాణాన్ని, సామాజిక వ్యవస్థనూ సమూలంగా కూలదోస్తుంది.

*దేశం అంతా కలిసి ఈ ప్రభుత్వరంగం ప్రైవేటీకరించడాన్ని, పెట్టుబడుల ఉపసంహరణను, వ్యూహాత్మక అమ్మకాలను అడ్డుకోవాలి. ఈ బాధ్యతలను కేవలం ప్రభుత్వరంగ కార్మికులపై మోపకూడదు.

★



# మూడేళ్ళ మోదీ పాలన

## కార్మికులు తమ హక్కులు జీవనోపాధిపై దాడిని తిప్పికొడుతున్నారు

2017 అంతర్జాతీయ కార్మికుల దినం సందర్భంగా మోదీ ప్రభుత్వంలోని కార్మికశాఖ ఢిల్లీలో ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో ప్రభుత్వం 'సులువుగా వ్యాపారం చేసుకోవడం'(Ease of doing Business)పై ప్రభుత్వం రూపొందించిన యాప్‌ను విడుదల చేయడానికే ఎక్కువ సమయం కేటాయించింది. ఈ సంఘటనే మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం శ్రామిక సైన్యంలోని ఎవరి 'సాధికారికత'కు తోడ్పడుతున్నారో, దేశ స్థూల జాతీయోత్పత్తి చెప్పుకోదగ్గ పెరుగుదల కారకులైన వారిగా ఎవరిని గుర్తించారో అర్థం అవుతున్నది.

ఈ మూడేళ్ళ కాలంలో మోదీ ప్రభుత్వ ఉద్దేశం స్పష్టం. విదేశీ పెట్టుబడి దారులను, పారిశ్రామిక వేత్తలను ఘనంగా స్వాగతించడం. వారికి ఎప్పుడు అవసరమనుకుంటే అప్పుడు కార్మికులను తీసుకుని అక్కర్లేదనుకున్న వెంటనే తొలగించే అవకాశం కల్పించడం, కార్మిక హక్కులను, వారి జీవితాలను గాలికి వదిలేయడం. కార్మికుల రక్షణకు ఇప్పుడున్న కార్మిక చట్టాలలోని అంశాలను కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ మధ్యనే సుప్రీమ్‌కోర్టుకు వచ్చిన ఒక కేసు ప్రభుత్వం కార్మికుల యెడల ఎంత ఉదాశీనంగా ఉన్నదో తెలియజేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం 1996 క్రింద వసూలు చేసిన రూ. 20,000 కోట్లు మాయం అయిపోయాయి. ఈ ధనం భవననిర్మాణ కార్మికుల పిల్లల చదువు తదితర సౌకర్యాల కోసం వాడవలసి వుంది. భారతదేశ అతిపెద్ద ఆడిటర్ CAG కూడా ఈ నిధుల గల్లంతుకు సంబంధించిన వివరాలు కనుగొనలేకపోయింది. అత్యున్నత కోర్టు 'ఈ నిధి ఎక్కడికి పోయిందని' ప్రశ్నించింది. "ఇది టీ పార్టీలకు గాని ఆఫీసర్ల సెలవుల విలాసాలకు గాని వెళ్లిందా? తెలుసుకొండని" నిర్దేశించింది.

**కార్మిక హక్కులపై దాడి :** గత మూడేళ్ళు కార్మికుల హక్కులపైన వారి ఉపాధి పైన తీవ్రమైన దాడులు జరిగాయి. దీనికి తోడు 2016 నవంబరు మాసంలో జరిగిన నోట్లరద్దు 85% మార్పిడిలో ఉన్న పెద్దనోట్లు రద్దు చేయడంతో నోట్లమీద ఆధారపడి పనిచేసే చిన్న చిన్న పరిశ్రమలలో పనిచేసే 35% కార్మికులు (4 లక్షలమంది) రోడ్డున పడ్డారు. ఒకవైపు లక్షలాది మంది కార్మికుల ఉపాధి కోల్పోయి జీవన పోరాటంలో సతమతమవుతుండగా, మరోవైపు డిజిటల్ చెల్లింపు ఏజెన్సీలైన పేటైమ్, మొబివిక్, రిలయన్స్ జియో పండగ చేసుకున్నాయి.

బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం కార్మిక 'సంక్షేమం' కోసం చేసిన ప్రతిపాదనలు ఇదివరకు కార్మికులకున్న కాసింత రక్షణని పూర్తిగా తొలగించాయి. అదీ కార్మిక సంఘాలతో ఏ చర్చలూ జరపకుండానే.

మోదీ ప్రభుత్వం ఒకవైపు 90 శాతంగా ఏరకమైన రక్షణలేని అసంఘటితరంగ కార్మికులు ఉండగా, కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను, కాజువల్ పనివారి సంఖ్యను మరింతగా పెంచుతున్నది. అదే సమయంలో సంఘటిత రంగంలో ఆర్జించుకున్న వేతనంలో విశ్రాంత కాలానికి పనికి వస్తాయని దాచుకున్న డబ్బును (ప్రోవిడెంట్ ఫండ్) షేర్ మార్కెట్‌లో పెట్టి, తమకు 'మంచి లాభాలు' వస్తాయని భ్రమింపచేస్తున్నది.

2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విదేశీ పెట్టుబడిదారుల పారిశ్రామిక వేత్తలకు అనువైన ప్రభుత్వం వచ్చి కార్మికుల హక్కులపై దాడి మొదలు పెట్టింది. రాజస్థాన్‌లో ఒక "కార్మిక చట్ట ప్రయోగశాల" ఏర్పాటు చేయబడింది. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వాలు వీటిని అనుసరించడం మొదలు పెట్టాయి. వీటి ఏకైక లక్ష్యం  కార్మిక చట్టాలు సులభతరం చేసి కార్పొరేట్ల ప్రయోజనాలు కాపాడే 'సులువైన' చట్టాలు రూపొందించడం.

ఫ్యాక్టరీ చట్టానికి సవరణలు తేబడ్డాయి. అదేవిధంగా ఎప్రంటీస్ చట్టం కూడా సవరించబడింది. 80% పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా గుర్తించే కొత్త చట్టం రూపొందించబడింది. ఫలితంగా ఇందులోని కార్మికులకు కార్మిక చట్టాలేవి వర్తించకుండా చేయడం జరిగింది.

ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే 30% మంది కార్మికుల మద్దతు ఉంటేగాని కార్మిక సంఘం రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలులేదు. అంతకు ముందు 15% మద్దతు సరిపోయేది. కార్మిక చట్టం కూడా 50 మందిపైన నియమించుకున్న పరిశ్రమలకే వర్తిస్తుంది. అంతకు ముందు 20 మంది ఉంటేచాలు.

మోదీ ప్రభుత్వం 44 కేంద్ర చట్టాలను 5 కోడ్లుగా విభజించే ప్రణాళికలో ఉన్నది. వేతనాలపై ఒక కోడ్ ఇదివరకే రూపొందించబడింది. రెండో కోడ్ మూడు

చట్టాలను – పారిశ్రామిక వివాదాల చట్టం, సంఘనిర్మాణ చట్టం (ట్రేడ్ యూనియన్ యాక్ట్), స్టాండింగ్ ఆర్డర్‌లను కలిపివేస్తుంది. దీని ప్రకారం 300లోపు కార్మికులున్న సంస్థలు కార్మికులను తొలగించేందుకు, ఫ్యాక్టరీ మూసివేసినందుకు, ప్రభుత్వ అనుమతి పొందాల్సిన అవసరం లేదు. ఇంకో మూడు కోడ్లు తయారీలో ఉన్నాయి. సామాజిక రక్షణ, ఆరోగ్యం, భద్రత, పని పరిస్థితులు.

చిన్న పరిశ్రమల (ఉద్యోగ నియామకాల నియంత్రణ, పని విధానాలు) బిల్లు 2014, 40 కన్నా తక్కువమంది పనిచేస్తున్న పరిశ్రమలు ఆరు ముఖ్యమైన కార్మిక చట్టాలను పాటించవలసిన అవసరం లేదని సవరణలు తేబోతున్నది. యజమానులకు కార్మికులను తీసుకోవడం, తొలగించడం సులభతరం చేసి, సం॥లో 25 కోట్లు కన్నా తక్కువ లావాదేవీలు ఉన్న కొత్త పారిశ్రామిక వేత్తలకు, ఐదేళ్ళలోపు పరిశ్రమలు పెట్టినట్టు రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు తొమ్మిది రకాల ప్రాథమిక చట్టాల నుండి మినహాయింపును ఇవ్వనుంది.

రెగ్యులర్ పనికి అప్రెంటీస్‌ని నియమించుకునే అవకాశం అప్రెంటీస్ చట్టం కల్పించింది. 250 కన్నా తక్కువ పనివారున్న పరిశ్రమల అప్రెంటీస్‌ల ఖర్చులో సగం రాష్ట్ర ప్రభుత్వాలు భరించే విధంగా చట్టం సవరించడం జరిగింది.

**ప్రైవేటీకరణ**

మోదీ ప్రభుత్వం లాభాలార్జిస్తున్న ప్రభుత్వ సంస్థలను కూడా అమ్మకానికి పెట్టి పెద్ద ఎత్తున ప్రైవేటీకరణకు పూనుకుంది. ఇందువలన మరిన్ని ఉద్యోగాలు పోయే అవకాశాలు ఉన్నాయి. మోదీగారి ప్రైవేటీకరణ కార్యక్రమానికి సలహాలిచ్చేందుకు, అమలు చేసేందుకు కూడా రిలయెన్స్ మ్యూచ్యువల్ ఫండ్ (Reliance mutual fund)నే ఎంచుకున్నారు.

మోదీ ప్రభుత్వ ఉధృత ప్రైవేటీకరణ దేశంలో నిరుద్యోగం క్రితం సంవత్సరం ఉన్న 17.7 మిలియన్లనుండి 2017లో 17.8 మిలియన్లకు, వచ్చే ఏటికి 18 మిలియన్లకు చేరనున్న నేపథ్యంలో జరుగుతున్నది. శాతంగా చూస్తే ఇది 3.4 దగ్గర 2017–18కి స్థిరంగా ఉంటుంది (ఐఎల్ఓ) కార్మిక వర్గంలో మహిళల శాతం గణనీయంగా తగ్గింది. లక్షలాది ఖాళీ పోస్టులు నింపకుండా ఉండిపోతున్నాయి. పెద్దఎత్తున పరిశ్రమలు మూత పడడమో, కార్మికులను తొలగించడమో జరుగుతున్నది. ఐటి పరిశ్రమలలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. రోజురోజుకూ పరిశ్రమలు దివాలా తీస్తున్నాయి. నిజవేతనాలు నిలకడగా ఉంటున్నాయి. లేదా పడిపోతున్నాయి. బియ్యం, పప్పుధాన్యాలు, గోధుమలలాంటి నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. కార్మికుల స్థితి ఎన్నడూ లేనంత దీనంగా తయారవుతున్నది.

**కార్మికుల ప్రతిఘటన :**

మూడేళ్ళ మోదీ పాలన ఒక్క మాటలో చెప్పాలంటే కార్మికుల మీద వారి హక్కుల మీద అన్నివైపులనుండి దాడిని ఉధృతం చేయడంలోనే గడించింది. కార్మికుల ఐక్య అసమ్మతిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదే పది అఖిల భారత ట్రేడ్ యూనియన్లు ఇచ్చిన పిలుపుకు 150–180 మిలియన్ల కార్మికులు పాల్గొన్న రెండు సార్వత్రిక సమ్మెలు తెలియజేస్తున్నాయి.

ఇంత పెద్ద ఎత్తున జరిగిన సార్వత్రిక సమ్మెలు, వస్త్రపరిశ్రమలో శ్రామిక మహిళల ప్రతిఘటన, కర్ణాటకలో అంగన్‌వాడి పనివారు ప్రభుత్వాన్ని వాళ్ళ కాళ్ల బేరానికి తెచ్చిన పరిస్థితి, భారతదేశవ్యాప్తంగా వేలాది పరిశ్రమలో జరుగుతున్న సమ్మెలు, మోదీ ప్రభుత్వానికి చేస్తున్న హెచ్చరిక ఘంటికలు. వీటిని విస్మరిస్తే తన గొయ్యి తాను తవ్వుకోవడమే.

ఉన్న కార్మిక చట్టాలను తొలగించడం, నిర్వీర్యం చేసే చర్యలను, కార్మిక చట్టాలు అమలుచేసే యంత్రాంగాన్ని నిర్వీర్యంచేయడం, ప్రాథమిక కార్మిక చట్టాలు అమలుపరచకపోతే కఠినంగా శిక్షించకపోవడం, కార్మికులు సంఘాలను ఏర్పరచుకునే హక్కును కుదించడం, కార్మిక హక్కైన సమ్మె హక్కును కాపాడు కోనడం మొదలైన అంశాలై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి దేశంలోని కార్మికుల సిద్ధంగా ఉన్నారు. ప్రైవేటీకరణను ఆపాలని కాంట్రాక్టీకరణ, క్యాజువల్ కార్మిక విధానం, ఆపి వారిని రెగ్యులరైజ్ చేయాలని, విదేశీ పెట్టుబడిదారులను మచ్చిక చేసుకునేందుకు వారికిచ్చే రాయితీలు, మినహాయింపులు ఆపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

★




# మూడేళ్ళ మోదీ పాలన

## రైతులను దోచి కార్పొరేట్ల బొక్కసాలు నింపుతున్న మోదీ

రైతులకు, వ్యవసాయ కూలీలకు మంచి రోజులు (అచ్చేదిన్) తెచ్చి పెడతామన్న వాగ్దానంలో మూడేళ్ల క్రింద బిజెపి అధికారం హస్తగతం చేసుకుంది. స్వామినాథన్ కమిటీ సిఫారసు చేసినట్టుగా ఉత్పత్తి ధరకన్నా 50%ఎక్కువ వేసి గిట్టుబాటు ధర నిర్ణయిస్తామని, వ్యవసాయ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెడతామని, ఉపాధి పరిధిని విస్తృతపరుస్తామని, ఎమ్‌జిఎన్‌ఆర్‌ఇఏ కింద రోజువారీ కూలీలు పెంచుతామని, రైతులకు సేద్యపునీటి వసతులు మెరుగుపరుస్తామని, పంట భీమా కల్పిస్తామని, పెన్షన్లు, శాస్త్రీయమైన భూసేకరణ చట్టం రూపొందిస్తామని తద్వారా రైతుల ప్రయోజనాలు కాపాడతామని, ఇలాంటి మరెన్నో వాగ్దానాలు చేసింది. ఈ వాగ్దానాల పరిస్థితేంటో ఇప్పుడు చూద్దాం.

* రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. బిజెపి పాలిత మహారాష్ట్రలో అత్యధిక ఆత్మహత్యలు నమోదయ్యాయి. 2015లో ఎన్నడూ లేనంతగా 4291 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. బిజెపి పాలిత మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్‌లలో 6535 మంది (అంటే మొత్తం ఆత్మహత్యలలో 51.85%) ఆత్మహత్యలు చేసుకున్నారు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం పాలిస్తున్న రాష్ట్రాలన్నీ కలుపుకుంటే 7723 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు (61.28%) హరితవిప్లవం ఆద్యులుగా పేరుగాంచిన హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో కూడా చాలానే రైతుల ఆత్మహత్య

సంఘటనలు జరిగాయి. తమిళనాడులో గత నాలుగునెలలోనే 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పోషకాహారం కొరతతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లాంటి రాష్ట్రాలలో గత మూడు సంవత్సరాలలో లక్షకుపైగా ప్రజలు చనిపోయారు. ఉష్ట్రపక్షిలాగా ప్రభుత్వం నిజాలను ఒప్పుకోకుండా వాస్తవ సమస్యల పరిష్కారమార్గాలు వెతకకుండా ఉండడమే ఈనాటి మానవ విషాదం పొందుతున్న ప్రతిస్పందన.

* స్వామినాథన్ కమిటీ సిఫారసు మేరకు ఉత్పత్తి ధరకన్నా 50% ఎక్కువకు మద్దతు ధర ప్రకటించడం వట్టిమాటయింది. బిజెపి ప్రభుత్వం సుప్రీమ్ కోర్టులో అఫిడవిట్ ఇస్తూ ఉత్పత్తి ధరకంటే 50% అధికంగా మద్దతు ధరను నిర్ణయించలేమని స్పష్టం చేసింది. అంతేకాదు ఏ రాష్ట్రమయినా ప్రకటించిన మద్దతు ధరకంటే ఎక్కువ ఇచ్చికొంటే వారి నుండి పంటను సేకరించేది లేదని కేంద్ర ప్రభుత్వం ఆదేశాన్ని జారీ చేసింది. ఎందుకంటే ఎక్కువధరకు సేకరించడం 'మార్కెట్ వక్రత' (మార్కెట్ డిస్‌టార్షన్) కు దారితీస్తుందిట! ఫలితంగా అదనంగా బోనస్ చెల్లించే రాష్ట్రాలు కూడా ఆపివేసాయి. ఆ తక్కువ ధరకి కూడా సమర్థవంతమైన పంట సేకరణ లేదు. అందువలన రైతులు తెగనమ్ముకోవలసి వస్తున్నది.

* ఎన్నో పంటలకు ప్రకటించిన మద్దతు ధర పండించేందుకయ్యే ధరకన్నా తక్కువ ఉంటున్నది. ఉదాహరణకి కందిపప్పు మద్దతు ధర క్వింటాలుకు రూ. 5050/- గా నిర్ణయించడం జరిగింది. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ లెక్క ప్రకారమే కందిపప్పు పంట పండించేందుకు క్వింటాలుకు రూ. 5722/- అవుతుంది. తెలంగాణాలో రూ. 6841/-, కర్ణాటకలో రూ. 5100/- ఉంది. సరైన సేకరణ విధానం లేక రైతులకు క్వింటాలుకు రూ. 4500/- కూడా రావడం లేదు. ప్రభుత్వం మొజాంబిక్‌లోని రైతులకు విత్తనాలు సరఫరాచేసి, సాంకేతిక పరిజ్ఞానం అందించి, రవాణాచార్జీలు కూడా భరించడానికి సిద్ధపడింది. కాని భారత రైతులకు మాత్రం సరైనధర చెల్లించను సిద్ధంగా లేదు.

*గోధుమలపై ఇదివరకు దిగుమతి సుంకం 25% ఉండగా దానిని తొలగించారు. ఇందువలన భారతదేశానికి విదేశాల గోధుమలు క్వింటాలు రూ. 1321 నుండి రూ. 1431/-లోపు దిగుబడి అవుతున్నాయి. ఇది ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 1625/- కన్నా చాలా తక్కువ. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయడంలో విఫలమయ్యింది. కొనుగోలు కేంద్రాలు తెరవనేలేదు. ఫలితంగా రైతులు తెగనమ్ముకోవలసి వస్తున్నది. చలికాలం వచ్చేముందే దిగుమతులకు తలుపులు బార్లు తెరవడంతో పంట దిగుబడి బాగా వున్న అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, రష్యా, ఉక్రేన్ తదితర దేశాలనుండి గోధుమ దిగిపోయింది. ఈ దశాబ్దంలోనే ఎన్నడూ

లేనంత కొనుగోలు ఈ ఏడాది జరిగింది. దీని ప్రభావం భారత దేశ రైతులపై తీవ్రంగా ఉండబోతున్నది. అసలే ప్రపంచవ్యాప్తంగా గోధుమ ధరలు పడిపోతున్నాయి. గోధుమ వ్యాపారంలో దిగ్గజాలు - కార్గిల్, ఐటిసి, అదాని-విల్‌మర్, రిలయన్స్ లాంటి వారు దిగుమతి సుంకాలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ చర్య వారికి ప్రయోజనం చేకూర్చేదిగా ఉంది. గోధుమ దిగుమతి వ్యాపారులు ఈ ఏటి దిగుమతులు 5 మిలియన్ టన్నులు దాటుతుందని అంచనా వేస్తున్నారు.

* భూసేకరణ ఆర్డినెన్స్ వెనక్కు తీసుకోవలసి వచ్చిన తర్వాత బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి మిత్ర బృందం మహారాష్ట్ర, జార్ఖండ్, గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌లు కార్పొరేట్లకు అనువుగా భూసేకరణ చట్టాలలో మార్పులు తీసుకుని రావడంలో ముందున్నారు.

* ఎమ్‌జిఎన్‌ఆర్‌ఇజిఏ (MGNREGA) పథకంలో కేటాయింపులే తగ్గుతూ వస్తున్నాయి. శ్రామిక బడ్జెట్ కేటాయింపులు తగ్గడంతో కొత్త ఉద్యోగాల అవకాశాలు కుదించుకుపోతాయి. క్రితం సంవత్సరంలో చట్ట ప్రకారం ఈ పథకం క్రింద ఇవ్వాల్సిన 100 రోజుల పనికి బదులుగా 46 రోజులే ఇచ్చారు. ఈ యేడు కేంద్ర ప్రభుత్వం కేటాయింపులు మరింత తగ్గించేందుకు కొత్త విధానాలను ఎంచుకుంది. జవాబుదారీతనం పేరుతో జియోట్రాకింగ్‌విధానాన్ని (స్థలాన్ని తెలుసుకోడం) ప్రవేశపెట్టారు. గత మూడేళ్లుగా జరిగిన పని రుజువులతో సహా సమర్పించాలి. చేసిన పనులరీత్యా ఇవి పూర్తిగా ఇవ్వడం సాధ్యపడదు. త్రిపురలాంటి రాష్ట్రాలలో మారుమూల ప్రాంతాలలో వేసే కచ్చా రోడ్లను గుర్తించడం, లెక్కవేయడం సాధ్యపడదు. అందువలన నిధులలో కోత పడుతుంది. దేశంలో సరాసరి 46 రోజుల పనికల్పించగా త్రిపురలో 79 రోజులు ఈ పథకం క్రింద పని కల్పించారు. కేంద్రం ఈ కుంటిసాకులు చూపి నిధులు మంజూరు చేయకపోవడం సిగ్గుచేటు. శ్రామిక బడ్జెట్‌లోని కోతల వలన కేవలం 34 రోజులే పని కల్పించగలుగుతారు.

* బిజెపి ప్రభుత్వం MGNREGA పథకం క్రింద అత్యధికంగా రూ.4800 కోట్లు కేటాయించినట్టు చెప్పుకుంటున్నది. కాని కేటాయింపుల పెంపు 1.1% మాత్రమే. నిజానికి 2016-17 సమర్పించిన ఖర్చులకన్నా రూ.500 కోట్లు మాత్రమే ఎక్కువ. 2016-17 కన్నా పెంచడానికి కారణం సుప్రీమ్ కోర్టు జోక్యం మాత్రమే. ఈ పథకం యథాతథంగా అమలు చేయాలంటే రూ.80,000 కోట్లు అవసరమవుతాయి. చట్టం ప్రకారం వేతనాలు పనిచేసిన పదిహేను రోజులలోగా చెల్లించాల్సి ఉండగా అది జరగడం లేదు. 2016-17లో రూ.20,000 కోట్లు సకాలంలో చెల్లించలేదు. బకాయిలు మూడు వారాలనుండి ఆరునెలలవరకు కూడా ఉన్నాయి. ఇందుకు

ముఖ్యకారణం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సకాలంలో నిధులు విడుదల చేయడంలేదు. ఇప్పటికీ ఇంకా రూ.2000 కోట్లు బకాయిలు ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇది ఈ ప్రభుత్వపు సిగ్గుమాలిన ధోరణి. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఈ పథకానికి నిధుల కేటాయింపులు తగ్గిస్తూ క్రమంగా దీనిని నాశనం చేయాలని చూస్తున్నది.

*ప్రధానమంత్రి పంట భీమా పథకంలో 40% మంది ఎక్కువ రైతులను కలుపుకుంటున్నట్టు ప్రచారం చేసుకున్నారు. కాని కేటాయింపులలో రూ.4240 కోట్లు కోతపెట్టారు. రూ.13,240 కోట్ల నుండి రూ.9,000కోట్లకు తగ్గించారు. ఇందులోనూ అధికమొత్తం ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలకే చెల్లించారు. రైతులకు చెల్లించినది తక్కువ. 2016-17లో భీమా కంపెనీలకు రూ.21500 కోట్లు చెల్లించగా ఖరీఫ్ సాగు నష్టంగా రైతులు క్లెయిమ్ చేసినది రూ.4270.55 కోట్లు. ఇందులో ఇప్పటికే భీమా చెల్లించినది రూ.714.14 కోట్లు మాత్రమే. బహుళజాతి భీమా కంపెనీలు రూ.2100 కోట్లు రైతుల దగ్గర నుండి, ప్రభుత్వం దగ్గరనుండి కైంకర్యం చేసాయి.

*రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందచేస్తామన్న వాగ్దానాన్నీ మరిచిపోయిందీ ప్రభుత్వం. రుణాలలో ఎక్కువభాగం పట్టణ ప్రాంతాలకు, వ్యవసాయ పరికరాల వ్యాపారం చేసే చోటకి తరలిపోయింది. పేద భూమిలేని రైతులకు, వ్యవసాయ కూలీలకు అందించలేదు. బిజెపి ప్రభుత్వం నోట్లరద్దు వలన ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో బాగా విస్తరించి గ్రామాలలో రుణాలనిచ్చే సహకార బ్యాంకుల నడుం విరిచినట్టయింది. ధరల స్థిరీకరణ నిధి సరైన మద్దతు ధరలో రైతుల ప్రయోజనాలు కాపాడడం అటకెక్కేశాయి. ఆంధ్రాలోనూ, తెలంగాణాలోనూ మిరపరైతులు, మిర్చి ధర రూ.13000-15000 నుండి రూ. 1500-5000కి పడిపోవడం PMFBY ఎంతగా విఫలమయిందో తెలియజేస్తున్నది. రబ్బరు, వ్యాపార పంటలు, సుగంధ ద్రవ్యాల విషయంలోనూ ఇదే పరిస్థితి. ధరల ఎగుడుదిగుడుల వల్ల రైతులు తీవ్రమైన నిరాశకు లోనవుతున్నారు.

*మరో పథకం ప్రధానమంత్రి క్రిషి సించయ్ యోజన. దీని లక్ష్యం ప్రతి ఎకరానికీ నీరందివ్వడం. ఇదీ ప్రచారంలో ముందుంది. కానీ ఈ మధ్య బడ్జెట్‌లో చిన్న నీటి పారుదల కల్పించే నిధికి ముందస్తు పెట్టుబడి (Initial corpus fund)గా రూ.5000/- కోట్లు కేటాయించినట్టు ప్రకటించారు. దీర్ఘకాల నీటి పారుదల సౌకర్యం కోసం పెట్టుబడిగా ఇప్పుడున్న రూ.20,000 కోట్లను రూ.40,000 కు పెంచుతారు. ఆర్థిక మంత్రి క్రితం ఆర్థిక సంవత్సరంలో ఎంత పెట్టుబడి పెట్టారో, ఏయే నీటి పారుదల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసారో ప్రకటించలేదు. 11వ పంచవర్ష ప్రణాళికలో రూ.67,477 కోట్లు నీటి పారుదలకు కేటాయించి 9.4 మిలియన్ల

హెక్టార్లకు సాగునీరు అందివ్వాల్సి ఉందన్న విషయాన్ని మనం గుర్తిస్తే ప్రస్తుతం కేటాయించిన నిధులు ఒక హెక్టారుకు రూ.10,000 కూడా లేదన్న విషయం మనకు అర్థం అవుతుంది. మొత్తం దక్షిణ భారతదేశం అంతా 2016-17 లోనూ 2015-16లో నీటి ఎద్దడితో సతమతమవుతుండడం చూస్తే ప్రభుత్వం ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఏమాత్రం సన్నద్ధంగా లేదని మనకు అర్థం అవుతున్నది. వారి వాగ్దానాలు ఎంత నేరపూరితమో అర్థం అవుతుంది.

దేశంలో అత్యధిక భాగం కరువులో అల్లల్లాడిపోతున్నా బిజెపి ప్రభుత్వం సరైన రీతిలో పరిహారం విడుదల చేయలేదు. గత 140 ఏళ్లలో ఎన్నడూ లేనంత కరువు పరిస్థితిని తమిళనాడు ఎదుర్కొంది. 12 లక్షల ఎకరాలలో పంటలేదు. పంట విపరీతంగా ఎండిపోయింది. దేశ రాజధానిలో తమిళ రైతుల ఆందోళన పట్ల మోదీ ప్రభుత్వం ఎంత మొరటుగా ప్రవర్తించిందో మనం చూశాం. రైతాంగంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. వారు ఎదుర్కొంటున్న దగాకోరు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పెద్దయెత్తున రైతులు ఆందోళనలు చేయబోతున్నారు. బిజెపి, హిందూత్వ శక్తులు పోరాటాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రజలలో 'గోవధ' అంటూ పశు పెంపకందార్ల పైకి 'గోరక్ష'కులనేవారిని ఎగదోస్తున్నారు. మత, కుల సమీకరణలకు ప్రయత్నాలు జరగుతున్నాయి. మోదీ నమూనా నీరు, అడవి, భూమి, గనుల దోపిడీకి వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, ఆదివాసీలు సమస్యల ప్రతిపాదన కలిసి ఉద్యమాలను నిర్మిస్తున్నాయి.

★

# మూడేళ్ళ మోదీ పాలన
# ధరలు

మోదీ ప్రభుత్వం తరచుగా గత మూడేళ్ళలో టోకు ధరల సూచిని చూపించి ధరల పెరుగుదల అత్యల్పంగా ఉన్నదని చెప్పుకుంటున్నది. ఇంకో అడుగు ముందుకేసి కొన్ని సమయాలలో ధరలు తగ్గాయని బీరండాలకు పోతున్నారు. అయితే వాస్తవాలు ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని మనకు తెలుసు.

అధికారిక గణాంకాల ప్రకారమే తెలియవచ్చిన ఈ క్రింది వాస్తవాలను పరిశీలించండి.

★ గతమూడేళ్ళలో సెనగపప్పు ధర 75% పెరిగింది. 2014 మేలో కిలో రూ. 49/– ఉండగా ఇప్పుడు రూ. 86/– పలుకుతున్నది.

★ మినప్పప్పు ధర 46% పెరిగింది. మే 2014లో రూ. 68/– ఉండగా ప్రస్తుతం రూ. 99/– ఉంది.

★ గత మూడేళ్ళలో కంది పప్పు ధర24% పెరిగింది.

ఇది మూడేళ్ళ మొదటిలోనూ చివరిలోనూ పోల్చి చూసుకున్నప్పుడు కనిపించే తేడాలు. ఇందులో మధ్య మధ్య అమాంతంగా పెరిగి ఆ తరువాత కాస్త తగ్గినవి ప్రతిఫలించడంలేదు. 2015 సెప్టెంబరులో కంది పప్పుధర కిలో రూ. 200/– వరకు పెరిగిపోయింది. ఏడాది క్రితం చక్కెర ధర రూ. 50/– కిలో పలికింది. మోదీగారి పాలనలోని మొదటి యేడు నెలల్లో ఉల్లి కిలో రూ100/– దాటింది. 2015 అక్టోబరులో ఆవనూనె కిలో రూ. 150/– పైనే ఉంది.

మనదేశంలో సాంప్రదాయకంగా గాని, మాంసం కొనలేకగాని ఎక్కువమంది శరీరానికి అవసరమయిన మాంస కృత్తులకోసం పప్పుధాన్యాల మీదే ఆధారపడతారు. పప్పుధాన్యాల ధరలు పెరగడం వలన బీదవారు ఇక పప్పుధాన్యాలను కొనలేని

పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ధరలు పెరగడం వలన పేదలు పప్పుధాన్యాలు కొనడం తగ్గించ వలసి వచ్చింది.

1951లో ఒక మనిషి సగటున రోజుకి 61గ్రాముల పప్పుధాన్యాలు వాడుతుండగా 2015లో వాడకం 44గ్రాములకు పడిపోయింది.

పప్పుధాన్యాల పెరుగుదలను ఒక ఉదాహరణగా మాత్రమే చూపించడం జరిగింది. కాని తినే ప్రతివస్తువు ధర ఈ రకంగా పెరిగిన అనుభవం మనందరికీ ఉంది. ప్రభుత్వం ధరల పెరుగుదలను తేలికగా తీసుకుంటున్నది. కొన్ని రోజులు పెరిగినా తరువాత వాటంతట అవే తగ్గుతాయన్న ధోరణిలో ఉన్నది. కాని పెరిగిన వారాలన్నీ పేదవాడు ధరలు పెరిగిన వస్తువులను కొనటం మానేయాల్సిందే. మళ్ళీ ధరలు తగ్గిన నాడే కొనగలుగుతాడు. మార్కెట్ మాయాజాలంలో ఇంతగా చిక్కుకోని మరే ప్రభుత్వమయినా ధరలు పెరుగుతుండగానే జోక్యం చేసుకుని అదుపులో ఉంచే ప్రయత్నాలు చేస్తుంది. కాని తనకు ముందున్న ప్రభుత్వంలాగా మోదీప్రభుత్వం కూడా ధరలు వాటంతట అవే "సరౌతాయని" నమ్ముతున్నది. ప్రభుత్వం సైద్ధాంతిక గంతలు కట్టుకున్న కారణంగా భారత ప్రజలు పర్యవసానాలను అనుభవిస్తున్నారు.

2014 జూన్‌లో, అంటే మోదీ పగ్గాలు చేపట్టిన కొన్ని వారాలకే అంతర్జాతీయ మార్కెట్‌లలో 'భారత ముడిచమురును గంప'లో (భారతదేశం ప్రత్యేకంగా దిగుమతి చేసుకుని ఉపయోగించే రకరకాల నూనెలు) ధర బ్యారల్ 109 డాలర్లకు చేరింది. క్రమంగా 2015 జనవరి నాటికి దీని ధర బ్యారల్ 47 డాలర్లకు పడిపోయింది. మళ్ళీ మేలో 64 డాలర్లకు పెరిగి 2016 జనవరి నాటికి 28 డాలర్లకు పడిపోయింది. తరువాత క్రమంగా పెరిగి ప్రస్తుతం 50 డాలర్లకు అటు ఇటుగా ఉంది. భారతదేశం అత్యధికంగా చమురు దిగుమతి చేసుకుంటున్నందువలన చమురు ధరలు ఈ పెరుగుదలలకు, తరుగుదలలకు అనుగుణంగా ఉంటాయని అనుకోవడం సహజం. కాని నిజానికి డీజిల్ ధర లీటర్‌కు రూ.56.71 నుండి రూ. 59.02కి పెరగగా పెట్రోలు ధరలు రూ. 71/- కి అటుఇటుగా ఉంటున్నది. ఇవి ఢిల్లీలోని ధరలు. మిగిలిన రాష్ట్రాలలో తేడాలు ఉండవచ్చు. కాని దాదాపు ఈ వరవడిలోనే ఉంటాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఇచ్చే కిరోసిన్ ధరకూడా గత మూడేళ్ళలో పెరిగింది. గ్యాస్ సిలిండర్ పరిస్థితి అదే. కిరోసిన్ రూ 14.96 నుండి 18.77కి పెరిగితే గ్యాస్‌ధర సిలిండర్‌రూ 414 నుండి 443కి పెరిగింది. సబ్సిడీని పరిగణలోకి తీసుకున్న తరువాత కూడా.

ఇలా ఎందుకు జరిగింది? మోదీ ప్రభుత్వం తగ్గిన ధరల ప్రయోజనాన్ని ప్రజల కిచ్చే బదులు తన ఖజానా పరిస్థితిని మెరుగుపరుచుకోవాలనుకున్నది. అందువలన

వినిమయ సూచీలో ధరలు తగ్గిన వెంటనే పన్నులు పెరిగాయి; ప్రజల భారాలు తగ్గలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టినా భారత ప్రజలకు ప్రయోజనం లేకుండా పోయింది.


కేంద్ర ప్రభుత్వం ఇంధన రంగంనుండి వసూలుచేసిన పన్నులు మనకీ విషయాన్ని స్పష్టంచేస్తున్నాయి. 2013-14 సంవత్సరంలో, అంటే మోదీ అధికారంలోకి రాకమునుపు ఇంధన రంగం నుండి ప్రభుత్వానికి రూ. 1.06 లక్షల కోట్లు పన్నుగా వచ్చింది. మోదీ ప్రభుత్వం మొదటి యేడే ఇది 1.26 లక్షల కోట్లకు చేరింది. ఆ తరువాత యేడు ఏకంగా 2.1 లక్షల కోట్లకు ఎగబాకింది. అంటే అంతకుముందు రెండు సంవత్సరాలకంటే ఇది రెట్టింపు. దీనర్థం మోదీ ప్రభుత్వం ప్రతి భారతీయ కుటుంబం దగ్గరనుండి చమురు సంబంధిత వస్తువులనుంచి రూ. 4250/- అదనంగా వసూలు చేసింది. ఇది పన్నుల ద్వారా ప్రత్యక్షంగా వసూలు చేసినది. ప్రతికుటుంబం పై పడ్డవాస్తవ భారం ఇంతకన్నా ఎక్కువే ఉంటుంది. ఎందుకంటే రవాణాకి డీజిల్ వాడబడుతుంది. నీటి పంపులకు, కరెంటు పోయినపుడు వాడే జనరేటర్లకు డీజిల్ వాడుతుంటాం, డీజిల్ ధరపెరగటంతో వీటన్నింటి వాడకంలో దాని ప్రభావం ఉంటుంది. అంటే ఈ భారాలన్నీ ప్రజలే భరించారు. ముఖ్యంగా పేదప్రజలే.

**అయితే ఏంచేయాలి?**

1. నిత్యావసర వస్తువులన్నీ ప్రజాపంపిణీ వ్యవస్థలో అందుబాటులో ఉంచాలి. ప్రజా పంపిణీని సార్వజనీనం చేయాలి.
2. అత్యవసర మందుల ధరలపై నియంత్రణ కఠినంగా ఉండాలి.
3. ప్రభుత్వం రకరకాల వస్తువులను సమంజసమైన ధరలకు సేకరించి ప్రజా పంపిణీ వ్యవస్థకు అందించాలి.
4. వస్తువులను దొంగతనంగా దాచేవారిపైన, (బ్లాక్ మార్కెట్ చేసి) అమ్మేవారి పైనా కఠిన చర్యలు తీసుకోవాలి.
5. ఏ.పి.యం.సి లను పటిష్ఠపరచాలి. వ్యాపారులు కూడబలుక్కుని (Trader Cartel) ధరలు పెంచుతున్న ధోరణిపై సాధిస్తున్న ఆధిపత్యాన్ని బద్దలు చేయాలి. (సేకరణ కేంద్రాల విస్తృతి పెంచాలి).
6. ఎగుమతులపై గట్టి నియంత్రణ ఉండాలి.
7. గోధుమపై దిగుమతి సుంకం విధించాలి.

**చమురు సంబంధిత ఉత్పత్తుల విషయం:**

1. మార్కెట్ నుండి వేరు చేయాలి.
2. కేంద్ర ప్రభుత్వ పన్నుల తగ్గించాలి.
3. గ్యాస్ సిలిండర్‌లను సబ్‌సిడీలో పంపిణీ చేయాలి.



# మూడేళ్ళ మోదీ పాలన
## విద్యపై దౌర్జన్యం నిరాఘాటంగా కొనసాగింపు

క్రిందటేడు మోదీ రెండేళ్ళ పాలనను విశ్లేషిస్తూ మనం నిరంతరంగా ఆధిపత్య ధోరణితో దౌర్జన్యానికి విశ్వవిద్యాలయాలలోనూ విద్యార్థులపైనా దాడులకు పాల్పడుతూ వారిపై ఆర్.ఎస్.ఎస్. ఎజెండా అయిన హిందుత్వంను రుద్దుతున్నదని చెప్పుకున్నాం. విద్యార్థులపై ఆర్థిక దాడులకు కూడా పాల్పడుతున్నదని, ఈ కాలంలో పోరాటాలు, ప్రతిఘటనలు పెరుగుతూ ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాగే ఉద్యమంలో విద్యార్థులు కేంద్ర బిందువుగాను చోదక శక్తిగాను ఎలా ఉన్నారో చూసాం. ఒక ఏడాది తరువాత మన అవగాహన మరింత బలపడింది.

**ప్రజావిద్య ధ్వంసం :** దవులత్‌సింగ్, కోఠారీ నాయకత్వం వహించిన 'ఇండియన్ ఎడ్యుకేషన్ కమిషన్' (1964-66)తో సహా గత 50 సంవత్సరాలలో అనేకసార్లు స్థూల జాతీయోత్పత్తిలో 6% విద్యకు ఖర్చు చేసే విధంగా కేటాయింపులు పెంచాలని లక్ష్యం  పెట్టుకున్నాం.

ప్రకాష్ జవదేకర్ భారతదేశం స్థూల జాతీయోత్పత్తిలో 4.5%(కేంద్రం, రాష్ట్రాలు కలిసి) ఖర్చుచేస్తున్నాయని ఫిబ్రవరి 2017లో వాదించారు. అయితే 2016-17ఆర్థిక సర్వే ఈ గణాంకం 2.9% అని చూపింది. జవదేకర్ కేటాయింపులు ఇంకాపెరిగి 6% చేరుకోవడమే లక్ష్యం అని చెప్పుకున్నారు. నిజానికి మోదీ ప్రభుత్వం కేటాయింపులు పెంచక పోగా తగ్గించింది.

**విద్యకు కేటాయింపులు దిగదుడుపు**

**కేంద్ర ప్రభుత్వం విద్యకు కేటాయిస్తున్నది.**

| | మొత్తం బడ్జెట్‌లో% | జిడిపిలో% |
|---|---|---|
| 2013-14 | 4.57 | 0.63 |
| 2014-15 | 4.14 | 0.55 |
| 2015-16 | 3.75 | 0.50 |
| 2016-17(మార్చిన అంచనా) | 3.65 | 0.49 |
| 2017-18(బడ్జట్ అంచనా) | 3.71 | 0.47 |

**మూలం: యం.హెచ్.ఆర్.డి. బడ్జెట్ పత్రాలు.**

మనం కేటాయింపులు లెక్కించేటప్పుడు ప్రైవేటు పెట్టుబడులను కూడా కలుపుకోవాలని జవదేకర్ వాదిస్తున్నారు. (ఇది బిజెపి ఎన్నికల వాగ్దానానికి పూర్తిగా విరుద్ధం) ఇందులో కొత్తేంలేదు. ఇది ఉదారవాద విధానాల ప్రచారంలో చెప్పే, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు, లక్ష్యాలను మరుగున పరిచేందుకు గణాంకాలను తిమ్మిని బిమ్మిని చేసే విధానానికి అనుగుణంగానే ఉంది.

ఈ విధానం అవలంబించడం వలన సర్వశిక్ష అభియాన్‌తో సహా అనేక కేంద్రంభరించే విద్యా పథకాలు ప్రత్యక్షంగానే దెబ్బతిన్నాయి. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలు సర్వశిక్ష అభియాన్‌లాంటి పథకంలో 40% ఖర్చు భరించాలని(ఇది వరకు ఇది 25% ఉండేది) ప్రతిపాదించింది, కేంద్రం తన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేక పోయింది. 2017-18లో ఉదాహరణకి యం.హెచ్.ఆర్.డి అంచనాల ప్రకారం సర్వశిక్షా అభియాన్‌కి రూ. 55,000 కోట్లు అవసరం అని డిమాండ్ చేయగా రూ. 23500 కోట్లు మాత్రమే కేటాయించడం జరిగింది. అంటే 42.7% మాత్రమే అంగీకరించబడింది.

ఈలోగా నానాటికీ విద్యా ప్రమాణాలు ప్రభుత్వ పాఠశాలలో తగ్గుతున్న దృష్ట్యా మరింతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను అధిక మొత్తాలలో ఫీజులు గుంజే ప్రైవేటు పాఠశాలలకే పంపాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశ వ్యాప్తంగా తల్లిదండ్రుల సంఘాలు ఈ విధానాన్ని (racket) ఎంతగా వ్యతిరేకించినా ఫలితం శూన్యం. సి.బి.ఎస్.ఇ పాఠశాలలు ఇటువంటి తప్పుడు చర్యలకు 'పాటు పడకూడదని' ఒక సర్క్యులర్ జారీ చేసినా పట్టించుకునే నాథుడేలేదు. యాజమాన్యాలు అసలు పట్టించుకోడం లేదు. దానికి ప్రధాన కారణం విద్యాసంస్థలకు అనేక బూర్జువా పార్టీ రాజకీయ నాయకులకు మధ్యనున్న దుష్టసంబంధాలే. కేంద్రం, రాష్ట్రాలు కూడా ప్రైవేటీకరణకు కట్టుబడి ఉన్నందువలన ఈ సంబంధాలను చూసిచూడనట్లు వదిలి వేస్తున్నాయి.

ఇందువలన ఎక్కువగా నష్టపోతున్నది దళితుల, గిరిజనులు, మైనారిటీలు, మహిళలు. నిధుల కొరత వల్ల పరిశోధనలకు స్కాలర్‌షిప్పులు ఇవ్వడం ఆలస్యం అవుతున్నది. ఫలితంగా స్కాలర్‌షిప్ పైనే ఆధారపడిన మొదటి తరం ఉన్నత చదువులలోకి అడుగు పెడుతున్నవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు అన్యాయంగా, అమానుషంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలోని సీట్ల కుదింపు గోరు చుట్టుపై రోకటి పోటులా తయారయింది. ఇది అంచులకు నెట్టి వేయబడిన తరగతులను మరింతగా కుదిపివేస్తుంది. జె.ఎన్.యు చారిత్రాత్మకంగా ప్రవేశ విధానంలో, దగా పడిన, అది ప్రాంతీయత వలన అయినా, లింగ వివక్షత వలన అయినా – వారికి అదనపు పాయింట్లు ఉండడం వలన అటువంటి వివక్షతలకు గురైన వారు ఉన్నత చదువులకు వెళ్ళే అవకాశాలు కల్పించబడ్డాయి. దీనికి మొట్టమొదటి బలయ్యింది జె.ఎన్.యు. ఈ కోతల ఇప్పుడు పాట్నా, వార్ధా, జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయాలలోనూ అమలవుతున్నాయి.

**ప్రైవేటీకరణ వ్యాపారీకరణ పెంపుదల**

ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం, యుజిసి కూడా స్వయం ప్రతిపత్తి కోసం దరఖాస్తులు చేసుకునేందుకు కళాశాలలపై తీవ్రమైన వత్తిడి తెస్తున్నాయి. ఈ కాళాశాలల 'స్వయం ప్రతిపత్తి ఆలోచన' మొట్టమొదటి సారిగా ఎన్.పి.ఎ–1 హయంలో బిర్లా – అంబానీలు ప్రతిపాదించారు. యుజిసి 12వ ప్రణాళిక పత్రం 'స్వయం ప్రతిపత్తి' కళాశాలలకు మార్గదర్శకాలను సూచిస్తూ, కమిషన్ ఇచ్చే స్వయం ప్రతిపత్తి గ్రాంటును కొత్త పోస్టులకుగాని, సాధారణ అనూహ్య కళాశాల ఖర్చులకుగాని, సబ్‌సిడీలకు గాని వాడకూడదని స్పష్టం చేసింది. పరీక్షలకు అయ్యే ఖర్చు, పరీక్షా విభాగంలో పనిచేసేవారి నియామకాలకయ్యే ఖర్చును లెక్కకట్టి పరీక్షా ఫీజుగా వసూలు చేయాలని కూడా సూచించింది.

ఇప్పటికే యుజిసి కేంద్ర 575 స్వయం ప్రతిపత్తి కళాశాలలు ఉన్నాయి. ఇందులో 167 ప్రభుత్వ సంస్థలున్నాయి. ప్రఖ్యాతమైన చెన్నైలోని లైలా కళాశాల, కలకత్తా, ముంబాయిలోని సెయింట్ జేవియర్ కళాశాలలకు ఇదివరకే స్వయం ప్రతిపత్తి ఇవ్వబడింది. ఇదివరకటి కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలకు విశ్వవిద్యాలయ స్థితిని కల్పించబడింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని చాలా స్వయం ప్రతిపత్తి కళాశాలలు ఆర్థికంగానూ విద్యాపరంగానూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఫలితంగా స్వయం ప్రతిపత్తి విధానం గురించి చెప్పుకుంటున్న దానికి వాస్తవ పరిస్థితులకు మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది.

'స్వయం ప్రతిపత్తి'ని విద్యాప్రమాణాలకు కలపడం జరిగింది. ఏ సంస్థ అయినా గత పదేళ్ళలో కనీసం 'బి' గ్రేడ్‌ని మూడుసార్లుకంటే పొంది ఉంటే తప్ప స్వయం

ప్రతిపత్తి స్థానం కోసం దరఖాస్తు చేసుకునే వీలులేదు. అంటే ర్యాంక్ పెంచుకునే క్రమంలో స్వయం ప్రతిపత్తి వైపు మరల్చబడతారు. ఈ మధ్యనే '2017 భారతదేశ ర్యాంకింగ్ రిపోర్టు' నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (NIRF) తయారుచేసి ప్రకటించింది. దీని ప్రకారం 'స్వయంప్రతిపత్తి' 'ర్యాంకింగ్' రెండూ ప్రైవేటీకరణకు ఉపకరణాలు. అంటే చదువు మరింత ఖరీదు అయి సంపన్నుల సొంతమవుతుంది. అత్యధికులు డి.గ్రేడ్ సంస్థలలో చేరవలసి ఉంటుంది – అదీ అక్కడ వరకూ చేరగలిగితే. ఒకవైపు పేరుపొందిన మంచి సంస్థలు చాలా కొద్దిగా ఉన్నాయి. మరోవైపు ఎక్కువ సంస్థలు సరైన ఉపాధ్యాయులు లేక, ఎక్కువ మందిని ఇముడ్చుకున్న తరగతులతో, మౌలిక సదుపాయాలు లేక సతమతమవుతున్నాయి.

ఇంకొక పార్శ్వమేమంటే, నిధులు సమకూర్చుకునేందుకు కొన్ని ముందస్తు షరతులు విధించబడ్డాయి. ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (CBCS), సెమిస్టర్ విధానం, తప్పనిసరి ఎక్రెడిటేషన్ ఇందులో కొన్ని. RUSH క్రింద ఉన్నత విద్యకి నిధుల మంజూరు పని ఫలితాల ఆధారంగానూ, సాధారణ పనివిధానం ఆధారంగానూ ఉంటుంది. అంటే రాష్ట్ర ప్రభుత్వాలు గాని విశ్వవిద్యాలయాలు గాని తమ ప్రత్యేక పరిస్థితులకు అనుకూలంగా ఏరకమయిన మార్పులను చేసే వీలు ఉండదు. నిధుల మంజూరు పని ఫలితాల ఆధారంగా ఉంటుంది. వాటికి కొన్ని నిర్దిష్ట విధానాలు (విద్యార్థి – ఉపాధ్యాయుల నిష్పత్తి, మౌలిక సదుపాయాలు, పరీక్షా ఫలితాలు) ఉంటాయి. ఇవి ఇప్పటికే ఉన్న అసమానతలను మరింతగా పెంచుతాయి.

**విధానాలను పునరుద్ధరించే పేరుతో గిమ్మిక్కులు**

ఎప్పటికప్పుడు కొత్త కొత్త విధానాలు, కొత్త కొత్త పథకాలను ప్రకటించడం ఈ ప్రభుత్వ విధానం. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో ఉన్న చాలా మంది మంత్రులు యుపిఎ ప్రభుత్వకాలంలో విపక్షంలో ఉన్నారు. 'చలనం లేని విధానాల'గా ఆనాడు వీటిని పేర్కొన్నారు. కాని ఈనాడు ఆ విధానాలను మరింత వెనక్కు తీసుకొనిపోతున్నారు. ప్రభుత్వ విద్యాలయాలను ధ్వంసం చేయ పూనుకుంటున్నారు. దానికో విధానపరమైన నిర్దేశాలు కూడా ఏంలేవు. మోదీ ప్రభుత్వం తాను అధికారంలోకి వచ్చిన వందరోజులలో కొత్త విద్యా విధానాన్ని ప్రకటిస్తానని వాగ్దానం చేసింది. టి.ఎస్.ఆర్ సుబ్రహ్మణ్యం కమిటీ తయారు చేసి ఇచ్చిన సిఫారసులన్నీ అటకెక్కాయి. (హెచ్.ఆర్.డి) మానవవనరుల మంత్రిత్వ శాఖ ముసాయిదా రిపోర్టు పరిస్థితి ఆదే. కొత్త విద్యావిధానం ఎలా ఉండబోతోందో అగమ్యగోచరంగా ఉంది. కొత్త విధానాలకు దిశానిర్దేశం లేదంటే దానికేవిధమయిన దృష్టికోణం లేదని కాదు. ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ విద్యను నాశనం చేసి ప్రైవేటీకరించడం, విద్యను పూర్తిగా కాషాయీకరించడం అన్న రెండు రకాల దృష్టితో

ఇది పని చేస్తున్నది. దానికో ప్రజాప్రయోజన విధానం లేదు.

**హిందూత్వ అహంకారం**

సంఘ్ పరివార్ ఎజెండాలో విద్యకు కూడా చాలా ప్రముఖ పాత్ర ఉన్నది. ఆర్.ఎస్.ఎస్ చే నడపబడుతున్న స్కూళ్ళ ద్వారా, పసిపిల్లలకు సహితం హిందువుననే గర్వాన్ని నూరిపోయడం, విద్యా సంస్థలన్నింటినీ నాశనం చేయడం, స్కూలు పాఠ్యాంశాలను మార్చేయడం వగైరా దాని నైజాలు. నిజానికి నయా ఉదారవాద విద్యా సంస్కరణలు విశ్వవిద్యాలయాలను సమాజం నుండి మరింత దూరం చేస్తాయి. (ఎందుకంటే విద్యతో మమేకమై ఉంటే సామాజిక స్పృహ విద్యనుండి దూరంగా పెట్టబడుతుంది) ఇందువలన ఈ పరిస్థితి సామాజిక, రాజకీయాలలో ప్రభుత్వ సంస్థల పాత్ర మరింత క్షీణించడానికి దారి తీస్తుంది.

అయితే ఈ పరిస్థితులు ఏ సవాళ్ళను ఎదుర్కొకుండా నల్లేరుపై బండి నడకలా సాగిపోదు. ప్రభుత్వం నుండి కాషాయిదళం నుండి దాడులు ఎదురైనవెంటనే విద్యార్థుల నుండి అందుకు ప్రతిఘటన కూడా బలపడుతున్నది. కొత్త కొత్త తరగతులు కూడా ఇందులో చేరుతున్నారు. కాషాయిశక్తుల కొత్త రాజకీయ వ్యక్తీకరణలతో ప్రక్కకు తొలగిపోవలసి వస్తున్నది.

★

